
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 11 ఫిబ్రవరి 2025

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: కలెక్టర్


ప్రజల దగ్గర నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా భావించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి.. కేసు వెనక్కి తీసుకుంటా

● సబ్‌కలెక్టర్‌కు దివ్యాంగుడి వినతి

మదనపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నా భూమికి సంబంధించిన ఆర్‌వోఆర్-వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసి న్యాయం చేస్తే కోర్టులో నడుస్తున్న కేసును వెనక్కి తీసుకుంటానని బాధితుడు గొల్ల భాస్కర్ సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ఈ మేరకు దివ్యాంగుడు గొల్ల భాస్కర్ వినతిపత్రం అందజేశారు. మదనపల్లె మండలం వలసపల్లె రెవెన్యూ గ్రామం సర్వేనంబర్-547లో 2.73 ఎకరాల భూమిని 1986లో తన తండ్రి మల్లప్ప పేరున డి.ఫారం పట్టా ఇచ్చారని, దీనిని అదే ప్రాంతానికి చెందిన జయపాల్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మాధవ్‌రెడ్డి రికార్డులు మార్చేసి భూమిని కబ్జా చేశారని, బాధితుడు సీఎం చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై తాను అప్పట్లోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు బాధితుడు భాస్కర్ గతేడాది నవంబరు 20న సీఎంకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని పరిశీలించిన సీఎం కార్యాలయం నుంచి అర్జీదారునికి సమాధానం వచ్చింది. కోర్టులో కేసు ఉందని, ఎలా న్యాయం చేయాలన్నది అందులోని సారాంశం. దీనికి స్పందించిన భాస్కర్ కోర్టులో నడుస్తున్న కేసును వెనక్కి తీసుకుంటానని, మా తండ్రి పేరుతో ఉన్న డి.పట్టా భూమిని తన పేరున మార్చడంతో పాటు వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయాలని కోరారు.


హెల్పింగ్‌మైండ్స్ 6



● వారి ఆలోచనే సేవకు మూలం
● ఆరుగురితో మొదలై 18 వేలకు చేరిన సంఖ్య
● కరోనాలో 917 మృతదేహాలకు అంత్యక్రియలు

అనర్హుల లెక్క తేల్చండి..

● జగనన్న కాలనీల్లో అక్రమాలపై ప్రభుత్వం దృష్టి
● సమగ్ర విచారణకు కలెక్టర్లకు ఆదేశం
● యాప్ సిద్ధం.. రెవెన్యూ సిబ్బందితో విచారణ
● అక్రమాలు తేలితే.. పట్టాలు రద్దు



వైసీపీ హయాంలో కేటాయించిన జగనన్న కాలనీల్లో.. లెక్కకు మించి ఉన్న అనర్హుల లెక్క తేల్చమని కలెక్టర్లకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర భూపరిపాలనా ప్రధాన కమిషనర్ జయలక్ష్మి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల సోమవారం నుంచి 15 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలి. ఈ విచారణ కోసం ప్రతి మండలంలోనూ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌వోలతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. విచారణలో తేలిన అనర్హుల ఇంటి పట్టాలను కలెక్టర్ రద్దు చేస్తారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తోంది.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పథకాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ పథకం కింద ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జిల్లాలో దాదాపు 74 వేల ఇళ్లను జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు కేటాయించింది. జిల్లాలోని అన్ని ముఖ్య పట్టణాలు, మండలాల్లోనూ.. జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రాయచోటి, రాజంపేట, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపాలిటీలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే జిల్లాలోని 74 వేల పైచిలుకు లబ్ధిదారుల్లో సుమారు 40 శాతం అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చాలామంది అనర్హులు అధికారాన్ని ఉపయోగించుకుని ఇంటి పట్టాలు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల ఒకే ఇంట్లో రెండు, మూడు పట్టాలు కూడా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం కావడంతో నిబంధనలతో పనిలేకుండా స్థానికంగా రాజకీయ పలుకుబడి ఉన్న వైసీపీ నాయకులు తమకు కావాల్సిన వాళ్లకు ఇంటి పట్టాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొందరు నాయకులు తమకు అప్పటికే సొంత ఇళ్లు ఉన్నప్పటికీ మళ్లీ జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు తీసుకున్నారు. ఇలా తీసుకున్న పట్టాలను లక్షల రూపాయలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీలలో జరిగిన అక్రమాలను వెలికితీస్తే అందులోని పట్టాలను అర్హులకు ఇవ్వవచ్చనే ఆలోచన కూటమి ప్రభుత్వంలో ఉంది. ఈ పరిస్థితుల్లో సోమవారం రాష్ట్ర భూ పరిపాలనా కమిషనర్ జగనన్న కాలనీల్లో జరిగిన అక్రమాల లెక్క తేల్చమని కలెక్టర్లను ఆదేశించింది.

యాప్ సిద్ధం.. విచారణకు రెవెన్యూ సిబ్బంది

ప్రతి మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలలో అనర్హుల నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక మొబైల్‌యాప్‌ను సిద్ధం చేసింది. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌వోలతో కూడిన విచారణా బృందం సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుంది. పట్టాలను పొందేందుకు తమకు అన్ని అర్హతలూ ఉన్నాయని లబ్ధిదారులే నిరూపించుకోవాలి. లేకుంటే అనర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలను రద్దు చేస్తారు.

లబ్ధిదారులు ఉంచుకోవాల్సిన పత్రాలు

అధికారులు విచారణకు వచ్చినపుడు లబ్ధిదారులు తమ వద్ద కింది పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి.


- తెల్లరేషన్‌కార్డు ఉండాలి.
- ఇళ్లపట్టాలు పొందిన వారికి అంతకు ముందే ఇల్లు లేదా స్థలం ఉండకూడదు.
- ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తుంటే ఇంటి పట్టా రద్దవుతుంది.
- కారు, నాలుగు చక్రాల వాహనం ఉంటే.. ఇళ్ల స్థలం రద్దు చేస్తారు.
- కుల ధృవీకరణ పత్రం ఉండాలి.
- కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి పట్టాలు ఉన్నా.. ఒకరికి మాత్రమే ఉంచి.. మిగతా వాటిని రద్దు చేస్తారు. (మ్యారేజ్ సర్టిఫికెట్ ఉంటే..అందరికీ వర్తిస్తుంది.)
- ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని అమ్మితే వాటిని రద్దు చేసి ఆ స్థలాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుంది.

లబ్ధిదారులు ఇచ్చే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆ తర్వాత పట్టాలు రద్దు చేసి నోటీసులు అందజేస్తారు.

రాయచోటి మునిసిపాలిటీలోని నారాయణరెడ్డిగారిపల్లె కాలనీ జగనన్న కాలనీలో రాయచోటి మునిసిపాలిటీకి చెందిన సుమారు 7 వేలకు పైగా ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇందులో సుమారు సగానికి పైగా అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాయచోటి పట్టణంలో రెండు, మూడు సొంత ఇళ్లు ఉన్న వాళ్లకు సైతం ఇక్కడ ఇంటి పట్టాలు ఇచ్చినట్లు సమాచారం. గతంలో రాయుడు కాలనీ, ఇందిరమ్మకాలనీ, ఏజీ గార్డెన్, సిబక్‌తుల్లా నగర్ ప్రాంతాలలో ఇంటి పట్టాలు పొంది పెద్ద పెద్ద ఇళ్లు కట్టుకున్న వాళ్లకూ ఇక్కడ ఇంటి పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవేకాకుండా పలువురు రాయచోటి పట్టణంతో సంబంధం లేకుండా పల్లెల్లో ఇంటి పట్టాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న వాళ్లకు కూడా ఇక్కడ ఇంటి పట్టాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ బినామీ పేర్లతో ఇంటి పట్టాలు తీసుకున్న పలువురు చోటామోటా వైసీపీ నాయకులు ఆ పట్టాలను అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న విచారణలో ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పీలేరు మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో అప్పటి వైసీపీ నాయకుల వ్యవహారశైలి దోచుకున్నోడికి దోచుకున్నంత అన్నట్లుగా సాగిందనే ఆరోపణలు ఉన్నాయి. పేరుకు పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామంటూ చెప్పిన వైసీపీ నాయకులు తమ ఇళ్లను చక్కబెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.20 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు అమ్ముకున్నారు. అలా అమ్మి.. ఆ పట్టాలను తాము చెప్పిన వాళ్ల పేరు మీద మార్పించారు. ఇదే సమయంలో కొందరు నాయకులు ఇళ్ల స్థలాలను కూడా తమ అదుపులోనే ఉంచుకున్నారు. అప్పట్లో వైసీపీ నాయకులు వారి స్థాయిని బట్టి ఇంటి పట్టాలను తమ అదుపులో ఉంచుకున్నారు.

మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎక్కువగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఈ విచారణ సక్రమంగా జరిగితే జిల్లాలోని జగనన్న కాలనీల లబ్ధిదారుల్లో సుమారు 40 శాతం అనర్హులు బయటపడే అవకాశం ఉంది. ఈ పట్టాలను నిజమైన అర్హులకు ఇవ్వవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

రాయచోటి నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ..



ఇళ్ల పట్టాలపై విచారణ చేయాలని కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వు

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

● మంత్రులు టీజీ భరత్, రాంప్రసాద్‌రెడ్డి


రాయచోటిలో కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు టీజీ భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని గాంధీబజార్‌లో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మంత్రులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో ఆర్యవైశ్యులకు పట్టించుకునే వారు లేరని, టీడీపీ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ పిలవగానే రాయచోటి పట్టణానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి మంచి కార్యక్రమాలు ఆయన చేతుల మీదుగా మరిన్ని ప్రారంభించాలని కోరుకుంటున్నానన్నారు. గాంధీబజార్‌లో ఎక్కువ మంది ఆర్యవైశ్యులు ఉన్నారని, మీకు ఎటువంటి సమస్యలున్నా నా దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాబోయే రోజుల్లో రాయచోటి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని, ఇందుకు ప్రతిఒక్కరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేశ్‌కుమార్, కార్యదర్శి కేపీఎల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మంత్రులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎక్కడి పనులక్కడే...!

● ఆగిపోయిన గాలేరు నగిరి- హంద్రీనీవా ఎత్తిపోతల పథకం పనులు
● వైసీపీ ప్రభుత్వ హామీలన్నీ నీటిమూటలే...
● రూ.400 కోట్లతో పనులన్నారు.. చేసిందేమీ లేదు...
● లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సాగునీరు ప్రశ్నార్థకం


నిరుపయోగంగా ఉన్న పైపులు, జాంద్రపల్లె వరకు వచ్చి ఆగిపోయిన పైపులైను

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి కాలువ ఉంచి హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా అన్నమయ్య జిల్లాకు సాగునీరు అందిస్తామని గత వైసీపీ ప్రభుత్వ పాలకులు చెప్పిన గొప్పలన్నీ నీటిమూటలుగా మిగిలాయి. 2022 సంవత్సరంలో రూ.400 కోట్లతో టెండర్లు పిలిచి ఓ పెద్ద కంపెనీకి పనులు అప్పగించారు. ఈ పనులు 2024 సంవత్సరానికి పూర్తి చేసి ఎన్నికలకు వెళతామని అప్పట్లో హామీలు గుప్పించారు. ఈ పనులకు కేటాయించిన 400 కోట్లలో రూ.150 కోట్లు ఖర్చు పెట్టారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో పనులు మొదలుపెట్టనే లేదు. ఈ రెండు మండలాల్లో 40 చెరువుల కింద సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గాలేరు-నగరి కెనాల్ ద్వారా వేంపల్లె మండలంలోని పాములూరు గ్రామం వద్ద డంపు ఏర్పాటు చేసి అక్కడ నుంచి చక్రాయపేట మండలంలోని కాలేటివాగు ప్రాజెక్టుకు నీరు నింపి అక్కడ నుంచి పైపులైన్‌ద్వారా లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని 40 చెరువులకు నీరు నింపాలన్నది ప్రణాళిక. అయితే ఈ ప్రణాళిక పూర్తిగా విఫలమైందని రైతులు అంటున్నారు. అంతేకాకుండా ఈ రెండు మండలాల్లోని పనులను మైనర్ ఇరిగేషన్ వారికి అప్పగించారు. రెండు సంవత్సరాల్లో మైనర్ ఇరిగేషన్‌వారు ఒక్క చెరువులో కూడా ఇంతవరకు పిడికెడు మట్టి కూడా ఎత్తలేదు. ఈ చెరువులు మరమ్మతులు చేసేది ఎప్పుడు.. కాలేటివాగు నీరు వచ్చేది ఎప్పుడో.. సాధ్యం కాని పనులను అమలు పరచారని రైతులు అనుకుంటున్నారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ఎలాంటి ప్రాజెక్టులు లేవు. అంతా మిట్ట ప్రాంతం. ఇక్కడ వర్షాధారంతోనే పంటలు సాగు చేసుకోవాలి. లక్కిరెడ్డిపల్లె మండలంలో 120 చెరువులు, కుంటలు, రామాపురం మండలంలో 150 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో పెద్ద చెరువులను గుర్తించి ప్రణాళిక తయారు చేశారు. కూటమి ప్రభుత్వంలో అయినా కాలేటి వాగు ప్రాజెక్టు నుంచి ఈ రెండు మండలాలకు సాగునీరు అందించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పనులు ఆగిపోయాయి

చక్రాయపేట ప్రాజెక్టు నుంచి 400 కోట్ల రూపాయల ఎస్టిమేషన్‌తో పనులు ప్రారంభించారు. 150 కోట్ల రూపాయల పనులు జరిగాయి. రెండు మండలాల చెరువులు మరమ్మతుల పనులను మైనర్ ఇరిగేషన్ వారికి అప్పగించారు. ప్రస్తుతం పనులు ఆగిపోయాయి.

- ప్రదీప్, జేఈ, జీఎన్ఎస్ఎస్

చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులను అలసత్వం చేయకుండా పరిష్కార మార్గం చూపాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పీలేరు మండల పరిధిలోని తలుపుల గ్రామం భయారెడ్డిగారిపల్లె నివాసి ఎర్రగుడి రవీంద్రనాథ్‌రెడ్డి (తల్లి శకుంతలమ్మ పేరుతో ఉన్న) భూమిని తన బంధువులు కబ్జా చేశారని కోర్టులో కేసు నడుస్తోందని దివ్యాంగుడినైన తనను వేధింపులకు గురి చేస్తున్నారని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. నడవలేని స్థితిలో అతడి దగ్గరకు ఎస్పీ నేరుగా వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుని చట్ట పరిధిలో పరిష్కరించాలని పీలేరు సీఐని ఆదేశించారు.


దివ్యాంగుడి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

11 మద్యం దుకాణాల లైసెన్సుల జారీ

● లాటరీ పద్ధతిలో కేటాయించిన కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కులాలకు సంబంధించి జిల్లాకు కేటాయించిన 11 మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతిలో పారదర్శకంగా లైసెన్స్ జారీ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్లుగీత కులాల మద్యం దుకాణాలకు లైసెన్స్ జారీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను కలెక్టర్ లాటరీ తీశారు. లాటరీలో ఎంపికైన వారికి మద్యం దుకాణాల లైసెన్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కల్లుగీత వారికి సంబంధించి కేటాయించిన మద్యం షాపులకు జిల్లాలో 135 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కల్లుగీత సామాజిక వర్గంలో ఉపకులాలైన గౌడ, ఈడిగ, గౌండ్ల నాలుగు ఉప కులాలకు బహిరంగంగా లాటరీ పద్ధతిలో రాయచోటి, మదనపల్లె, రాజంపేట మున్సిపాలిటీలు, అలాగే మండలాలకు 11 దుకాణాలు కేటాయించబడ్డాయని చెప్పారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా దరఖాస్తు చేసుకున్న ప్రతినిధుల సమక్షంలో వీడియోగ్రఫీ చేస్తూ లాటరీ తీశామని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, సహాయ సూపరింటెండెట్ జోగేంద్ర, ఇన్‌స్పెక్టర్ యల్లయ్య, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.


లైసెన్సుదారులకు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎక్సైజ్ ఈఎస్ మధుసూదన్, తదితరులు

గంజాయి గుట్టురట్టు...

● 2.25 కిలోల గంజాయి సీజ్ 6
● ఆరుగురు అరెస్టు
● 5 సెల్‌ఫోన్‌లు, రూ.20 వేలు నగదు స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కళ తప్పిన నాటకరంగం

● అలనాటి తోలుబొమ్మలాట, వీధి భాగవతాలకు ఆదరణ కరువు
● జీవనోపాధి కోల్పోయిన కళాకారులు
● పెన్షన్ మంజూరు కాలేదంటూ ఆవేదన 6

హెల్పింగ్ మైండ్స్

- వారి ఆలోచనే సేవకు మూలం
- ఆరుగురితో మొదలై 18 వేలకు చేరిన సంఖ్య
- కరోనాలో 917 మృతదేహాలకు అంత్యక్రియలు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వారి ఆలోచనే సేవకు మూలం. ఎదుటి వారికి సహాయం చేయాలన్న తలంపే 'హెల్పింగ్‌మైండ్స్'గా రూపాంతరం చెందింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సేవ చేయాలన్న ఆలోచనతో రక్తదానంతో మొదలైన సేవ రక్తం కోసం వెదికేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించే వరకు వెళ్లింది. ఫలితంగా ఏ ప్రాంతంలో ఉన్న వారికి రక్తం అవసరమన్నా యాప్ ద్వారా పొందవచ్చు. ఫలితంగా సేవకులు ఆపద్బాంధవులుగా కొనియాడబడుతున్నారు. 2013 ఏప్రిల్ 7వ తేదీ ఆరుగురితో మొదలైన హెల్పింగ్‌మైండ్స్ ప్రయాణంలో ప్రస్తుతం 18 వేల మంది సభ్యులు, 25 వేల మంది రక్తదాతలు ఉన్నారు.



పెళ్లిలో రక్తదానం చేస్తున్న అబూబకర్ సిద్దిక్ (ఫైల్)



కరోనాలో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు (ఫైల్)



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

రక్తదానంతో ప్రాణదానం

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్నగా చెప్పవచ్చు. ఎందుకంటే రక్తదానం ప్రాణదానంతో సమానం కాబట్టి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేకపోవడంతో అనేకమంది మృత్యువాతపడుతున్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు తమ వంతుగా రక్తాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం సొంత బంధువులకు కూడా సాయం చేసేందుకు వెనకడుగు వేస్తున్న పరిస్థితుల్లో మేమున్నామని భరోసా ఇస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతూ అందరి చేత ప్రశంసలను అందుకుంటున్నారు. చాలామంది ఒకటి, రెండు, మూడుసార్లు రక్త దానం చేసి ఉంటారు. కానీ హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు అయితే కొందరు 40 సార్లకు పైగా రక్తదానాలు చేసి ప్రజల ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచారు. మదనపల్లిలోని 'హెల్పింగ్ మైండ్స్' సభ్యులు రక్తదానం చేయడమే కాకుండా రక్తదాన శిబిరాలు సైతం ఏర్పాటు చేయడం దేశవ్యాప్తంగా రక్తం అవసరాలను దృష్టిలో ఉంచుకుని గూగుల్ ప్లేస్టోర్‌లో హెల్పింగ్ మైండ్స్ సొసైటీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందులో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చే ప్రతిఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఏ ప్రాంతంలో రక్తం అవసరం ఉంటుందో ఆ ప్రాంతాల వారు యాప్ ద్వారా రక్తదాతలను గుర్తించి సాయం పొందేలా రూపొందించారు. హెల్పింగ్ మైండ్స్ సంస్థకు కరోనా సమయంలో సేవలకు ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అప్పుడు మదనపల్లి టీడీపీ నేతల ద్వారా ప్రశంసాపత్రం అందజేశారు.



జాతీయ రక్తదాన దినోత్సవం రోజు రక్తదానం చేస్తున్న పోలీసులు, సంస్థ సభ్యులు (ఫైల్)

హెల్పింగ్ మైండ్స్ సేవలు విస్తృతం

హెల్పింగ్ మైండ్స్ సభ్యులు మరిన్ని సేవలను విస్తృతం చేశారు. ప్రధానంగా కరోనా సమయంలో కరోనాకు భయపడి బంధువులకు దూరమైన 917 మృతదేహాలకు వారి సంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. చదువుకునే వయస్సులో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వేసవి వచ్చిందంటే దాహార్తి తీర్చడానికి అవసరమైన చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో అడవిలో జీవులు మరణించకూడదని వందల సంఖ్యలో తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపుతున్నారు. హిందువుల ముఖ్యమైన పండుగల్లో వినాయకచవితి సందర్భంలో ఏటా భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు అందజేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. సీజన్‌లో అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులకు ఆనవాయితీగా అన్నదానం కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిరుపేదలకు గుప్పెడు అన్నం అందించడానికి మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్, గుర్రంకొండల్లో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. రోజూ వందమందికి అక్కడ ఫ్రీహబ్‌లలో అహార పొట్లాలు ఉంచుతారు. గృహ శుభా కార్యాలు, పుట్టినరోజులు, పెళ్లిళ్ల మిగిలిన అన్ని రకాల కార్యక్రమాల్లో మిగిలిన అన్నం పొట్లాలు నిల్వ చేస్తారు. నిరుపేదలు ఆకలితో ఉండకూడదన్న హెల్పింగ్ మైండ్స్ లక్ష్యం విజయవంతంగా నడుస్తోంది. చలికాలంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ సేవలు సాగుతున్నాయి. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా విగ్గులు అందజేస్తున్నారు. దేశవ్యాప్తంగా హెల్పింగ్ మైండ్స్ సంస్థ సేవలు విస్తరించి రాయలసీమకే వన్నె తెచ్చారు. వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని హెల్పింగ్ మైండ్స్ సంస్థ కోరుకోవడం విశేషం.

పెళ్లిలో కూడా రక్తదానం

మదనపల్లిలో స్థిరపడిన హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన అబూబకర్ సిద్దిక్ పెళ్లిలో కూడా రక్తదానం చేయడం విశేషం. వివాహ సమయంలో పెళ్లి కుమారుడు సహా మరో 52 మంది సభ్యులు రక్తదానం చేసిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఏ ఒక్కరి ప్రాణం పోకూడదు



రక్తం అందుబాటులో లేకపోడం వల్ల ఏ ఒక్కరూ మృత్యువాతపడకూడదన్న లక్ష్యంతోనే పదేళ్ల కిందట హెల్పింగ్ మైండ్స్ రక్తదాతల సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో వేల సంఖ్యలో దాతలు చేరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, అన్నమయ్య కడప బెంగళూరు, తిరుపతి, పంజాబ్, హైదరాబాదు నగరాలు సహా పలు ప్రాంతాల్లో హెల్పింగ్ మైండ్స్ సేవలు విస్తరించాం ఈ సంస్థ ద్వారా 25 వేల మందికి రక్తదానం చేశాం. గూగుల్ ప్లేస్టోర్‌లో యాప్‌ను తయారు చేశాం. ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేశాను. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సాయం అందివ్వాలి. కరోనా సమయంలో ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసాపత్రం ఇవ్వడం మరవలేనిది.

-అబూబకర్ సిద్దిక్,
హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు, మదనపల్లి.

గంజాయి గుట్టురట్టు...

- 2.25 కిలోల గంజాయి సీజ్
- ఆరుగురు అరెస్టు
- 5సెల్‌ఫోన్‌లు, రూ.20వేలు నగదు స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గంజాయి గుట్టు రట్టు అయింది. గత మూడు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన గంజాయి పీల్చేస్తున్నారు అన్న కథనంపై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. ఆ మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో వాల్మీకిపురం పోలీసులు గత రెండు రోజుల పాటు విస్తృత దాడులు నిర్వహించారు. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లకు వచ్చిన రహస్య సమాచారంతో రెండు రోజుల నుంచి ముమ్మర నిఘా చేపట్టడంతో గంజాయి గుట్టు రట్టయింది. పట్టణ శివారులోనే ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు కానీ విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులను పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకోవడం గమనార్హం. స్థానిక సాకలవారిబండకు చెందిన కాలపల్లె అంజమ్మ(54), ఇందిరమ్మ కాలనీకి చెందిన సయ్యద్ ఖలీల్(43),దయ్యాలడండకు చెందిన ఎస్.సమీర్(34), కత్తి సిద్దార్థ(19), నమాజ్‌కట్టవీధికి చెందిన నిమ్మనపల్లె కిరణ్(19)లతో పాటు మరో యువ కుడు ఆదివారం మధ్యాహ్నం పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీ పంలో గుంపుగా ఉండటం అనుమానించిన పోలీసులు వారి వద్దగల ప్లాస్టిక్ సంచులను సోదా చేయడంతో గంజాయి విక్రయాల విషయం బయట పడింది. ఈ తనిఖీలలో 2.250 కేజీల గంజాయిని సీజ్ చేస్తూ 5సెల్‌ఫోన్లు, రూ.20వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టుబడ్డ వ్యక్తులలో మహిళ బయటి ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకు వచ్చి వాల్మీకిపురం ప్రాంతం చుట్టుపక్కల విక్రయాలు కొనసాగిస్తున్నట్లు పోలీ సుల విచారణలో తేలింది. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. ఈ దాడులలో అదనపు ఎస్ఐ శ్రీహరి, ఏఎస్ఐ కరీముల్లాసాహెబ్, హెడ్‌కానిస్టేబుళ్లు వేణుగోపాల్, దస్తగిరి, ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, సిబ్బంది అబ్దుల్లా, లక్ష్మీపతి, రెడ్డిప్రసాద్, శివకుమార్, నరేష్, గిరిబాబు, బాబాప్రసాద్, రిజ్వాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి..

మాదక ద్రవ్యాల విషయంలో యువత పెడదోవ పట్టి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారి పట్ల తల్లిదండ్రులు తప్పక బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. తమ కష్టాలతో వ్యవప్రయాసలు పడి పిల్లల భవిష్యత్తు కోసం అన్నీ సమకూర్చే తల్లిదండ్రులు పిల్లలు ఎటు పోతున్నారో ఏమి చేస్తున్నారు విషయాల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. చదువు విషయంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారా ఏమిచేస్తున్నారు, ఎలా చదువుకుంటు న్నారన్న వాటిపై పర్యవేక్షణ లేకపోతే తర్వాత బాధపడాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలలో గంజాయి విక్రయాలు, వాటిని సేవించే వారు ఎంతటి వారైనా ఇకపై ఉపేక్షించేది ఉండదని చట్టరీ త్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాజంలో ప్రజలంతా కూడా బాధ్యత ఎరిగి ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

- తిరుచ్చిపై తిరుమాడ వీధులలో నగరోత్సవం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో సోమవారం పునర్వసు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలు, విశేష భక్త జనం నడుమ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. అనంతరం హోమాది కార్యక్రమాలు పూర్ణాహుతి గావించి వేడుకలు పూర్తి చేశారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయం త్రం భోగోత్సవమూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై అలంక రణలు గావించి తిరుమాఢ వీదులలో నగరోత్సవం నిర్వహించారు.



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఈ కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 16 మందికి జరిమానా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన షేక్. జాఫర్, తులసి ప్రసాద్, శైకలియాస్, సైడ్ సాయివల్లితోపాటు మరో 12 మందిని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పర్చగా మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10,500లు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారని వివరించారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి కృష్ణప్ప (62) అనే వృద్ధుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, పొన్నూటి పాలెం మోట్లపల్లెకు చెందిన కృష్ణప్ప కూలీ పనులకు వెళుతూ పనసమాకులపల్లెలో ఒక రోజు ఒక్కో ఇంట్లో భోజనాలు చేస్తూ జీవిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగే అలవాటు ఉండడంతో వారం నుంచి కనపడడంలేదని తెలిపా రు. సోమవారం కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోర్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతనికి కుమారుడు శంకర్, మనుమడు ఉన్నట్లు తెలిపారు.



మృతుడు కృష్ణప్ప (ఫైల్)

విజయవంతంగా ఎస్‌డీడీ ప్రోగ్రాం

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్‌డీడీఆ (జాతీయ నులిపురుగుల నిర్మూలన) కార్యక్రమం విజయవంతం అయ్యిందని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ తెలిపారు. రాయచోటిలోని మాసాపేట-3 అంగన్వాడీ కేంద్రంలో, విశ్వభారతి స్కూల్‌లో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 97.25 శాతం మాత్రల పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. పాఠశాలకు గైర్హాజరు అయిన విద్యార్థులకు ఈ నెల మాప్ అఫ్ రౌండ్‌లో మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నరసింహా, ఏఎన్‌యం సలీమా, అంగన్వాడీ టీచర్ ఇర్షాద్‌బేగం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

కళ తప్పిన నాటకరంగం

- అలనాటి తోలుబొమ్మలాట, వీధి భాగవతాలకు ఆదరణ కరువు
- జీవనోపాధి కోల్పోయిన కళాకారులు
- పెన్షన్ మంజూరు కాలేదంటూ ఆవేదన

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల క్రితం ప్రజలకు వినోదాన్ని పంచిపెట్టింది తోలుబొమ్మలాట.తొలుబొమ్మలాట, నాటక ప్రదర్శన అన్నా ప్రజలు తమ పనులను వదిలి చూసేందుకు వెళ్లేవారు. కళాకారులు కూడా వైభవంగా వెలుగుతూ ఉండేవారు. కాలక్రమేణా సినిమాలు, సీరియళ్ల మొదలయ్యాక నాటకరంగం ఆదరణ కోల్పోయింది. ప్రస్తుత ఆధునిక యుగంలో నాటకరంగం పూర్తిగా అంతరించిపోయింది. దీంతో పూర్తిగా కళాకారులు నాటక ప్రదర్శనలు లేక ప్రభుత్వాల నుంచి ఆదరణ కరువై జీవచ్ఛవంలా బతుకుతున్నారు. ఈ క్రమంలో బద్వేలు పట్టణ సమీపంలోని చెన్నంపల్లె గ్రామంలో తొలుబొమ్మలాటగాళ్లు, నాటకరంగ కళాకారులుగా ఒక వెలుగువెలిగి, ప్రస్తుతం ఉపాధికోల్పోయిన వారి జీవన శైలిపై ప్రత్యేక కథనం.



తోలుబొమ్మలాటలో ప్రదర్శించే తోలుబొమ్మలు

తరతరాలుగా నాటకరంగ కళాకారులు

బద్వేలు పట్టణం సమీపంలో ఉన్న చెన్నంపల్లె గ్రామంలో తరతరాలుగా నాటకరంగ కళాకారులు కొనసాగుతున్నారు. తోలుబొమ్మలాట, వీధి బాగవతాలు,భారతం వంటి నాటకాలను ప్రదర్శిస్తూ జీవనాన్ని కొనసాగించారు. ఒకప్పుడు నాటకరంగానికి మంచి ఆదరణ ఉన్నప్పుడు వెలిగిపోయిన ఆకుటుంబాలు, ప్రస్తుతం జీవనాన్ని కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాయి.

మహారాష్ట్ర నుంచి వలస

మహారాష్ట్రలోని మరాఠాకులానికి చెందిన కాళే అప్పారావు కుటుంబీకులు కొన్నివందల సంవత్సరాల క్రితం కడప జిల్లాకు వలసవచ్చారు. ఉమ్మడి కడపజిల్లాలోని ఒంటిమిట్ట సమీపంలోని సీతాపురం గ్రామంలో స్థిరపడగా, అక్కడి నుంచి బద్వేలు పట్టణ సమీపంలోని చెన్నంపల్లెకు మరికొన్ని కుటుంబాలు వచ్చి స్థిరపడ్డాయి. అప్పటి నుంచి నాటకరంగాన్నే నమ్ముకొని నాటకప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచిపెడుతున్నారు. కుటుంబంలో పెద్దలందరూ చనిపోగా, ప్రస్తుతం కాళే శ్రీనివాసరావు, వనపర్తి శాంతిరావు కుటుంబసభ్యులు ప్రస్తుతం నాటకప్రదర్శనలను కొనసాగిస్తున్నారు.

తోలుబొమ్మలాటలో అందవేసిన చెయ్యి

అంతరించిపోయిన తొలుబొమ్మలాటలో చెన్నంపల్లె గ్రామానికి చెందిన కుమార వెంకటయ్య పూర్వీకులు అందెవేసిన చెయ్యిగా పేరుగాంచారు. తోలుబొమ్మలాటలో కుమార క్రిష్టారావు, వెంకటరావు, సుబ్బారావు తదితరులు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. వారి వారసులు కుమార వెంకటయ్య ప్రస్తుతం కూడా తోలుబొమ్మలాట ప్రదర్శనలనే నమ్ముకొని జీవిస్తున్నారు. అయితే తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ఎక్కడా ఆదరణ లేకపోవడంతో ప్రస్తుతానికి ఇంటి వద్దే ఖాళీగా ఉన్నారు.

పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు

రాయలసీమలోని కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలేకాక, నెల్లూరు, ప్రకాశం, క్రిష్టా జిల్లాల్లో నాటకప్రదర్శనలు చేశామంటున్నారు చెన్నంపల్లె కళాకారులు. అప్పట్లో తమ నాటకప్రదర్శనలను చూసేందుకు తండోప తండాలుగా ప్రజలు వచ్చేవారని, ప్రస్తుతం నాటక ప్రదర్శనలు ఉన్నా, వయస్సు పైబడిన వృద్ధులు, మధ్యవయస్కులు తప్ప కుర్రకారుకు నాటక ప్రదర్శనపై ఆసక్తిలేదంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాటకరంగానికి ప్రస్తుతం ఆదరణ లేకపోవడంతో కుటుంబపోషణకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తర తరాలుగా నాటకరంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రస్తుతం జీవనానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి. కళాకారుల పెన్షన్ మంజూరైతే కొంత మేర ఇబ్బందులు తొలుగుతాయి.

- కాళే శ్రీనివాసరావు, నాటకరంగ కళాకారుడు, చెన్నంపల్లె.

కళాకారులకు పెన్షన్ మంజూరు కాలేదు



ఎన్నో ఏళ్లుగా నాటకరంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. ఇన్నేళ్లుగా కళారంగానికి సేవచేసినా మాకు కళాకారులకు ఇచ్చే పెన్షన్ మంజూరు కాలేదు. ప్రభుత్వం కళాకారుల పెన్షన్‌ను మంజూరు చేయాలి.

- కాళే మౌలమ్మ, మహిళా కళాకారిణి, చెన్నంపల్లె.

ఆదరణ కోల్పోయాం ఆదుకోండి



తాత ముత్తాల కాలం నుంచి తోలుబొమ్మలాటనే నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రస్తుతం తోలుబొమ్మలాట పూర్తిగా ఆదరణ కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కళాకారులకు చేయూతనందించాలి. కళాకారుల పెన్షన్ మంజూరైతే జీవనానికి ఇబ్బంది కలగదు.

-కుమార వెంకటయ్య,
తోలుబొమ్మలాట కళాకారుడు, చెన్నంపల్లె.

ఉద్యోగ నియామకాల్లో ఇష్టారాజ్యం

● ప్యాక్స్‌లో అమలుకాని రోస్టర్

● నష్టపోతున్న బలహీన వర్గాలు



కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో భారత రాజ్యాంగం ప్రకారం పక్కాగా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని శాఖల్లో ఈ విధానం అమలు కానట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు శాఖల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టే ఉద్యోగ నియామకాల్లో సక్రమంగా రిజర్వేషన్లను అమలు చేయలేకపోవడంతో బలహీనవర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సహకారశాఖలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో (పీఏసీఎస్) ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసే క్రమంలో పక్కాగా రోస్టర్‌ను అమలు చేయకపోవడంతో రిజర్వేషన్లు అమలు కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగానికి సేవలందించేందుకు సహకార శాఖ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలను నిర్వహిస్తోంది. ఇందులోని సిబ్బందిని పాలక వర్గం నియమించాల్సి ఉంటుంది. అయితే పలుచోట్ల నియామకాల్లో రోస్టర్ పద్ధతిని అమలు చేయకపోవడం, తమ అనుయాయులను నియమించుకోవడం కోసం పాలకవర్గాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సొసైటీలో పనిచేస్తున్న సిబ్బంది పదవీ విరమణ చెందితే ఆ ఖాళీలను భర్తీచేసే క్రమంలో కొన్నిచోట్ల అక్రమాలకు కూడా పాల్పడుతున్నట్లు చర్చ సాగుతోంది.

నిబంధనలకు నీళ్లు

జిల్లాలో గత కొంతకాలంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల్లో చేపడుతున్న నియామకాల్లో నిబంధనలు పాటించడం లేదని సమాచారం. 1964లోని రూల్ 5లోని 24వ ఉప నిబంధన ప్రకారం కాకుండా రిక్రూట్‌మెంట్ పద్ధతిని ఇష్టానుసారంగా చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఏదైన ఒక ఖాళీని భర్తీ చేసేందుకు మొదట తాత్కాలిక పద్ధతిన నియమించి ఆ తర్వాత క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం అంతా జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా చేపట్టాల్సి ఉంది. ఇదిలా ఉంటే రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు వారి వ్యాపార స్థాయిల ప్రకారం ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుంది. పీఏసీఎస్‌లలో ఒక సీఈఓ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్, సబ్ స్టాఫ్ క్యాడర్‌గా పోస్టులను విభజించారు. ఇందులో సీఈఓ పోస్టుకు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలి. అదేవిధంగా కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పాసై ఉండాలి. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కు కంప్యూటర్ ప్రావీణ్యంతో పాటు డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి. సబ్‌స్టాఫ్ పోస్టులకు సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. ఏదైన ఒక సొసైటీలో ఖాళీలు ఏర్పడితే వాటి నియామకానికి పీఏసీఎస్ తరపున జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీకి నివేదించాల్సి ఉంది. ఒక జిల్లాలోని సొసైటీలో ఏర్పడే సీఈఓ పోస్టులకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులలో ఉన్న వారి ద్వారా 25శాతం మేర ఖాళీలు భర్తీచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ పోస్టుకు అర్హులైన వారు సొసైటీలో లేకపోతే సొసైటీ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా ఖాళీలను నేరుగా భర్తీచేసేందుకు రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి సీఈఓలు, ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కు బదిలీలు తప్పనిసరి. జిల్లాలోని కొన్ని సొసైటీలలో అర్హులు ఉన్నప్పటికీ వారికి పదోన్నతి కల్పించేందుకు పాలకవర్గాల పెద్దలు సహకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నట్లు కూడా చర్చ సాగుతోంది.

పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో...

సొసైటీలోని సీఈఓలు సబ్ ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ పోస్టులు మినహా సబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి నియామకాలు చేపట్టడం తప్పనిసరి. సాధారణంగా సబ్‌స్క్రైబ్ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం స్థానిక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా వచ్చిన జాబితా ఆధారంగా నియామకాలు జరపాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు చేపట్టిన చాలా వరకు సొసైటీల్లో ఇవేవీ పాటించనట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఖాళీల భర్తీలో రోస్టర్‌ను అమలు చేయాల్సి ఉండగా పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో అర్హులైన బడుగు బలహీన వర్గాల ప్రజలు నష్టపోతున్నట్లు సమాచారం. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా వచ్చిన జాబితాతో పాటు సొసైటీ కార్యకలాపాల ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఏ ఏ పోస్టు లు ఉండే విషయం కూడా ఎవరికీ అంతుచిక్కని విషయం. దీంతో అక్కడ పోస్టుల భర్తీ గురించి కూడా పెద్దగా ఎవరికి అవగాహన లేకపోవడంతో కొన్ని సొసైటీల్లోని సిబ్బంది పాలకవర్గాల కనుసన్నల్లో నియామక వ్యవహారం జరిగిపోతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 77ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేసేవి. జిల్లా విభజన తర్వాత వాటి సంఖ్య 51కి పడిపోయాయి. ఇప్పటి వరకు ఎన్ని సొసైటీల్లో ఖాళీలు ఉన్నాయనే విషయం కూడా జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌కి సమాచారం లేదు. దీన్ని బట్టి చూస్తే సొసైటీల ఉద్యోగుల ఖాళీలు భర్తీలో సహకార చట్టంలోని నిబంధనలు పాటించడం లేదనేది స్పష్టమవుతుంది.

ఎటువంటి లేఖలు అందలేదు



ఈ విషయమై జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సాధారణంగా ఒక పోస్టుకు 20 మంది లెక్కన జాబితా అడుగుతారు. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఖాళీల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి లేఖలు మాకు అందలేదు.

పేదల గుడిసెలు తొలగింపు సమంజసమా?

● ఎమ్మెల్యే సుధ వ్యాఖ్యలపై సీపీఐ నేతల మండిపాటు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలం పీపీకుంట వద్ద నిరుపేదలు వేసుకున్న గుడిసెలు తొలగించాలని ఎమ్మెల్యే సుధ జిల్లా పరిషత్ సమావేశంలో పేర్కొనడం సరికాదంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ పేదలకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే వారి గుడిసెలను తొలగించాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గుడిసెలు వేసుకుని రోడ్డు, తాగునీటి సౌకర్యం లేకపోయినా ఏడాదికాలంగా జీవనం సాగిస్తున్నామని.. ఈ స్థలాన్ని వైసీపీ నాయకులకు కట్టబెట్టాలని చూడడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే పేదలకు అండగా నిలవాలే తప్ప వారి భూముల జోలికి వస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పీవీ రమణ, పడిగె వెంకటరమణ, పెంచలయ్య, ఇమ్మానుయేల్, ఖాదర్‌బాష, వెంకటయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనమస్కార ప్రదర్శనలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థికి తృతీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థి విజయ్

వేంపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన శత సహస్ర సూర్యనమస్కార ప్రదర్శనలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థి విజయ్ తృతీయస్థానంలో నిలిచాడు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు 1456 సూర్యనమస్కారాలు ఏకధాటిగా పూర్తి చేశాడు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1500 మంది పాల్గొని ట్రిపుల్‌ఐటీ విద్యార్థి తృతీయ బహుమతి పొందాడు. పట్టుదల, క్రమశిక్షణ, మానసిక స్థిరత్వాన్ని ప్రదర్శించి సూర్యనమస్కారాలు చేయడం అభినందనీయమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్‌లు అన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న జీవిసత్రం వాసులు



రోడ్డు పనులను అడ్డుకుంటున్న జీవీ సత్రంవాసులు

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుత్తి - కృష్ణపట్నం నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను మండలంలోని జీవి సత్రం వద్ద సోమవారం ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. బద్వేలు రోడ్డు నుంచి తమ పొలాలకు వెళ్లే దారి లేకుండా రోడ్డు నిర్మిస్తున్నారంటూ పనులు చేపట్టకుండా అడ్డగించారు. దీంతో రోడ్డు పనులకు సంబంధించిన అధికారులు వచ్చి యాజమాన్యంతో మాట్లాడి దారి ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

పులివెందులలో ఘర్షణ

● తాగిన మత్తులో ఓ నాయకుని కొడుకు హల్‌చల్

పులివెందుల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో పడగొట్టిన బస్టాండ్ సమీపంలో ఘర్షణ చోటుచేసుకుంది. తాగిన మత్తులో ఓ పార్టీకి చెందిన నాయకుడి కొడుకు హల్‌చల్ చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాల్లోకెళితే... అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం తిమ్మాపురానికి చెందిన వారు కడప వైపు నుంచి కారులో బస్టాండ్ సమీపానికి చేరుకున్నారు. కారుకు పాదచారి అడ్డురావడంతో కారు ఒక్కసారిగా బ్రేక్ వేశారు. కారు వెనుకలే వస్తున్న ఓ నాయకుడి కొడుకు బైకుపై వచ్చి కారును వెనుకవైపున ఢీకొట్టాడు. ఉన్నట్లుండి కారు ఆపితే వెనుకవచ్చేవారు ఏమవుతారని వారిపై మండిపడ్డారు. వెంటనే కారు నడుపుతున్న వ్యక్తిపై దాడికి దిగాడు. కారులో ఉన్న వారు ప్రతిఘటించినా వారిపై కూడా దాడికి ప్రయత్నించాడు. ఇంతలో అటుగా వెళ్తున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఏమి జరిగిందని ఆరా తీసేలోపు ఆ యువకుడు కారులో ఉన్న వారిపై మరోసారి దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఆ యువకుడిని గట్టిగా ప్రతిఘటించారు. దీంతో ఆ యువకుడు సహనం కోల్పోయి పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ యువకుడు కారులో ప్రయాణిస్తున్న వారికి జరిగిన సంఘటన విషయమై అతని బంధువులు, యువకుడు సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

కోవరంగుట్టపల్లిలో ఉద్యోగి ఆత్మహత్య.



పెద్దన్న (ఫైల్‌ఫొటో)

సింహాద్రిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లిలో సోమవారం చింతపండు పెద్దన్న (55) అనే ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దన్న తొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లర్క్‌గా విధులు నిర్వహించేవాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దన్న మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్దన్ (32) ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సిద్దవటం మండలం పాలకొండ్రాయునిపల్లెకు చెందిన జనార్ధన్ 6వ తేదీ ఉదయం జమాల్‌పల్లె వద్ద ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కడప రిమ్స్‌లో చికిత్స పొందు తూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి కుప్పాల యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

13 మంది జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం 34 వవార్డు దేవాంగపేటలోని జ్యోతి నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంటిలో జూదం ఆడుతున్న 13 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.65,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన జూదరులలో పోసా శ్రీనివాసులు అలియాస్ ఉంగరాల శ్రీను, హరీష్, మచ్చా నాగేంద్ర, కాళహస్తి శేషు తదితరులు వున్నారు. వీరిపై కేసు నమోదు చేసి వ్యక్తి గత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీ



కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం పోలీసులు లాడ్జీల తనిఖీ చేపట్టారు. లాడ్జీల్లో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించి బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. అనంతరం లాడ్జిల్లోని రిజిస్టరును పరిశీలించారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జిల నిర్వాహికులు అనుమానితులను గుర్తిస్తూ వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

యువతి అదృశ్యం



కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బుడ్డాయపల్లెలోని టెలికాంనగర్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన చింతకుంట భవిష్య (30) అనే యువతి అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసుస్టేషన్ ఎస్ఐ తెలిపా రు. యువతి బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు మోదు చే సి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121100523, 9121100524 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్‌డే



డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్ దినోత్సవం ఉండాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో డీన్‌లు, అన్ని శాఖల విభాగాధిపతులతో సైన్స్ దినోత్సవ నిర్వహణపై సోమవారం ఉపకులపతి తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. 28వ తేదీ సైన్స్ డే నిర్వహణపై అభిప్రాయాలను స్వీకరించారు. దేశంలో ప్రఖ్యాతిగాంచిన సైన్స్ పరిశోధకులను ఆహ్వానించి ఉపన్యాసం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే విద్యార్థుల్లో, పరిశోధకులలో లోతైన పరిశోధన అవగాహన కోసం పోస్టర్ ప్రజెంటేషన్ చేయనున్నారు. ఇందులో అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య కె.గంగయ్య, అన్ని శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైవీయూ దూరవిద్యలో కూచిపూడి భరతనాట్యం సర్టిఫికెట్ కోర్సులు

యోగివేమన విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం (సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్) ద్వారా కూచిపూడి, భరతనాట్యం కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌బాబు, ధర్మవరం కూచిపూడి కళా కేంద్రం కార్యదర్శి కె.ఎల్.కళ్యాణ్ చక్రవర్తి, అధ్యక్షులు కె.మంజుల, గౌరవ సలహాదారు నటరాజ కృష్ణమూర్తి సంతకాలు చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయు ద్వారా ఏడాది వ్యవధి గల సర్టిఫికేట్ కోర్సులు దూరవిద్య ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. కళారంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ కోర్సులను దూరవిద్య ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలిసి విడుదల చేశారు. సోమవారం వైవీయులోని తమ చాంబర్‌లో ఫలితాలను వీసీ పరిశీలించారు. ఫస్ట్ ఇయర్‌లో 63.36శాతం, మూడో సెమిస్టర్‌లో అన్ని గ్రూపులు కలుపుకొని 63.39శాతం ఫలితం నమోదైందన్నారు. ఐదో సెమిస్టర్‌కు సంబంధించి అన్ని గ్రూపులు కలిపి 77.83శాతం ఫలితాలు నమోదయ్యాయన్నారు. సహ పరీక్షల అధికారులు డాక్టర్ మమతకుమారి, డాక్టర్ కనుసు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళల హాకీ చాంపియన్ కడప



చాంపియన్‌గా నిలిచి కప్ అందుకుంటున్న కడప జిల్లా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 15వ ఏపీ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో కడప జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా కడప జట్టు ఉత్తమ ప్రదర్శనతో 2-0 గోల్స్ తేడాతో చాంపియన్‌గా నిలిచింది. అనంతపురం ద్వితీయస్థానం సాధించింది. అలాగే మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ, అనకాపల్లి జట్లు తలపడగా కాకినాడ 7-1 గోల్స్‌తో మూడో స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్‌పీటర్ విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రథమస్థానంలో నిలిచిన కడప జట్టుకు ట్రోఫీతోపాటు రూ.7వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీ, రూ.5వేలు, తృతీయస్థానంలో నిలిచిన కాకినాడ జట్టుకు ట్రోఫీ రూ.3వేలు నగదు అందచేశారు. అలాగే ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా క్రీడాకారిణి నందినికి, ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచిన కాకినాడ క్రీడాకారిణి వరలక్ష్మికు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురం జిల్లా క్రీడాకారిణి లక్ష్మీలకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ జోనాతాన్, సీనియర్ క్రీడాకారులు నవీన్, పోటీల నిర్వాహక కార్యదర్శి థామస్‌పీటర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు జీడీ.సురేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో దొంగల బీభత్సం

● రూ.1.30 లక్షలు నగదు, 5తులాల బంగారు, కేజిన్నర వెండి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న డీఎస్పీ



డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. కాలనీ నడిబొడ్డులో ఏఈలు నివాసం ఉండే ఈ బ్లాక్‌లో ఈ చోరీలకు పాల్పడ్డారు. వివరాలిలా... ఆర్టీపీపీలో ఇంజినీర్స్ నివాసం ఉండే 'ఈ' టైప్ క్వార్టర్స్ ఈ 338, 96, 112, 207, 213, 214 క్వార్టర్స్‌లో ఇళ్ల తాళం కింద వుండే కొండీని తొలగించి చోరీ చేశారు. 338 ఇంటిలో ఉంటున్న ఏఈ పద్మజ శుక్రవారం సాయంత్రం కుటుంబంతో కలసి పులివెందులకు వెళ్లింది. చోరీ జరిగినట్లు సమాచారం రావడంతో ఆమె సోమవారం ఉదయం హుటాహుటిన ఆర్టీపీపీకి వచ్చారు. ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.1.30లక్షల నగదు, 5తులాల బంగారు ఆభరణాలు, వెండి చెంబు, ప్లేటు, ఇతర వెండి వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. అలాగే మరో ఐదిళ్లలో కూడా చోరీ చేశారు. అయితే అక్కడ విలువైన వస్తువులు ఏవీ దొంగలకు దొరకలేదు. ఒక ఇంట్లో బంగారు, డబ్బు వున్నప్పటికి దొంగల కంట పడలేదు. మరో ఇంట్లో రూ.15వేల వరకు నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ చోరీల విషయం తెలుసుకున్న జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వర్లు సీఐ రఫీతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. చోరీ జరిగిన క్వార్టర్స్ లోకి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కాగా, ఆర్టీపీపీలో జరిగిన చోరీపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా చేసి వుంటుందన్న అను మానం వ్యక్తం చేశారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీంఎం ఏర్పాటు చేశామని వివరించారు.

పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం లక్కిరెడ్డిపల్లె తాలూకా పెన్షనర్ల సంఘం అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా విశ్వనాథయ్య, సహాయ అధ్యక్షుడుగా కుళ్లాయప్ప,ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, జమీల్‌బాషా, రహంతుల్లా, జనరల్ సెక్రెటరీగా వీరబల్లి వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎస్ఎం బాషా, జాయింట్ సెక్రెటరీలుగా ఎండీ రాముడు, రఘురామ, ట్రెజరర్ గా రామచంద్రయ్య, మెంబర్లుగా నరసింహులు, దస్తగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విశ్వనాథయ్య మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు.

పీఎంఏవైని సద్వినియోగం చేసుకోండి

సిద్దవటం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ చెన్నయ్య సోమవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 2.0, డీఎల్‌సీ, యూడీఏ కింద గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారులు తమ కులం, ఆదాయం ధ్రువీకరణ, , ఆధార్‌కార్డు, రేషన్, ల్యాండ్ డాక్యుమెంట్లు సమకూర్చి స్థానిక సచివాలయంలో ఫిబ్రవరి 20 లోపు ఇవ్వాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం లభిస్తుందని వ్యవసాయశాఖ అధికారి జి. సుధాకర్ తెలిపారు. సోమవారం రైల్వే కోడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మహిళలు పండించిన ఆకుకూరలు, కూరగాయలు, కొర్రలు, కంది పప్పు, చింతపండు, మెంతులు, పెసలు, ఉద్దులు, అలసందులు, ఆవాలు తదితరాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏపీసీఎన్ సీ సిబ్బంది, ఎంసీఏ సుబ్బరాయుడు, గోవిందు, వెంకటరత్నం, బేబీ సుజిత, సుజాత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏపీజీబీ మేనేజర్ ఇంతియాజ్ ప్రారంభిం చారు. మండల ఇన్‌చార్జి మధుకర్, డీపీఎం ప్రవీణ, వై. నాగమణి, ఏంటీ పద్మావతి, ఎల్‌వన్ వెంకట్రామిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పొలానికి కంచె.. ప్రమాదాలకు పిలుపు!

● బొమ్మవరం క్రాస్ మీదుగా వెళ్లేందుకు భయపడుతున్న గ్రామస్తులు



ఆర్ అండ్ బీ రోడ్డు మలుపు వద్ద వాహనదారులకు కనిపించని రోడ్డు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మలుపులో ఉన్న పొలానికి షేడ్‌నెట్‌తో కంచె వేయడంతో అవతలి వైపునుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని శేషక్కగారిపల్లె ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానమై ఉన్నాయి. బి.కమ్మపల్లె నుంచి బొమ్మవరం శేషక్కగారిపల్లె, గోవిందంపల్లెకు వెళ్లే మార్గం మధ్యలో ఉన్న మలుపు వద్ద ఉన్న భూమిని ఒక రైతు ఆక్రమించి సాగు చేస్తున్నాడు. ఈ పొలానికి రక్షణగా ఆయన చుట్టూ పట్టలు కప్పడంతో ఆ దారి మలుపు నుంచి అటు ఇటు వెళ్లే వాహనాలు రోడ పై వెళ్లేవారికి కనిపించవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు, గ్రామ ప్రజలు వాపోతున్నారు. బొమ్మవరం, బి.పి రాచపల్లె, తుమ్మకుండ, నాగవరం, కేవీఆర్‌ఆర్‌పురం, శేషక్కగారిపల్లె, గోవిందపల్లె, బి.కమ్మపల్లె చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చిట్వేలికి వెళ్లేందుకు దగ్గరి దారి కావడంతో ఎక్కువ శాతం ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. అలాగే అరటి, బొప్పాయి, మామిడి వంటి పండ్లతోటలు ఉండడం వల్ల ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజు సుమారు 10 స్కూలు వ్యాన్లలో వందలాది మంది విద్యార్థులు వెళుతూ ఉంటారు. ముగ్గురాయి లారీలు సైతం ఈ మార్గంలో వెళుతుంటాయి. ఇంతటి రద్దీగా ఉన్న మార్గంలో మలుపు ఆవల వచ్చే వాహనాలు కనిపించకపోతే ప్రమాదా లు జరిగే అవకాశాలున్నా యని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పు కాలువ నీరు బొమ్మవరం చెరువుకు వెళ్లే కాలువ పూడ్చడం వల్ల నీరు పక్కనున్న పొలాల్లో చెరువులాగా నిండుకున్నాయని అధికారులు, నాయకులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి : మంత్రి మండిపల్లి



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. రామాపురం మండలం బండపల్లిలో రూ.7.20 లక్షలతో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంటు రోడ్ల పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమానికి ముందు మంత్రి బండపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం పలువురు ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయ కులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, రెడ్డికుమార్, రామచంద్ర, భయ్యారెడ్డి, రెడ్డిబాబు, గంగాధర్, సురేందర్‌రెడ్డి, రేఖం ఆంజనే యులు బ్రదర్స్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెం: బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరి ష్కరించాలన్నారు. అనంతరం అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

క్రీడాకారుడికి అభినందన

షూటింగ్ బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన షేక్. మహమ్మద్ యూసుఫ్‌బాషాను మంత్రి మండిపల్లి అభినందించారు. తంబళ్లపల్లె మండల కేంద్రానికి చెందిన షేక్. మహమ్మద్ యూసుఫ్ ఈ నెల 1, 2, 3 తేదీల్లో నేపాల్‌లో ఇండియా- పాకిస్తాన్ మధ్య జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో ఇండియా తరఫున పాల్గొన్నారు. సోమవారం పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆ క్రీడాకారుడిని అభినందించారు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

రాజంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోం నిధియాదేవి అధికారులకు సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆమె అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు అందజేసి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

నీటి సద్వినియోగంపై ర్యాలీ

సిద్దవటం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నీటి సద్వినియోగంపై సోమవారం మండలంలోని ఎస్.రాజంపేటలో సోమవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులతో సకాలంలో వర్షాలు పడడంలేదని వర్షాధార ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయం ఒక సమస్యగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నీటి వృధాను నివారించాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ జనార్దన్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రామచంద్ర, ఏఎస్ఐ బాబయ్య, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి, స్థానిక పోలీసు లక్ష్మయ్య, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై కడప ఆర్డీవో రివ్యూ

సిద్దవటం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులపై కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్ సోమవారం రివ్యూ చేశారు. రెవెన్యూ సదస్సులో అందిన అర్జీలు పరిష్కరించకుండా అలసత్వం చేసిన వీఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిద్దవటం హౌసింగ్ కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో శంకర్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, మండల సర్వేయర్‌లు పాల్గొన్నారు

ఘనంగా సీతారాముల కల్యాణం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డీస్‌కాలనీ రామాలయంలో సోమవారం .పునర్వసు నక్షత్రం రోజున సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కావలి వెంకటసుబ్బారెడ్డి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ మాజీ చైర్మెన్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యు లు పాల్గొన్నారు అనంతరం అన్నదానం చేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

గాలివీడు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలు, సిబ్బందితో కలిసి ఆమె గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజల అర్జీలను స్వీకరించారు. తన భూమి 24 సెంట్లు ఆక్రమణకు గురైందని మండల కేంద్రంలోని పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన అక్కయ్య ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

వీరబల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యలను పరిష్కరిం చాలంటూ ఫార్మర్స్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రాజ శేఖర్‌రాజు సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. భూ సమస్య లపై రెవెన్యూ సదస్సుల్లో చేసిన ఫిర్యాదులేవీ ఇంత వరకు పరిష్కారానికి నోచుకోలేదని తెలియజేశారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గాలివీడు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కల్పించుకునేందుకు మండలంలోని బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ కార్పొరేషన్ల రుణాలకు అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గాలివీడు స్టేట్ బ్యాంక్ పరిధిలో బీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి ఒకటి, కాపులకు నాలుగు, మైనార్టీలకు 13 యూనిట్లు, యూనియన్ బ్యాంకులో బీసీలకు 15, ఈడబ్ల్యూఎస్ కు ఒకటి, కాపులకు నాలుగు, మైనార్టీలకు 13 యూనిట్లు కలవని, ఏపీజీవీలో బీసీలకు 9, ఈడబ్ల్యూఎస్‌కు ఒకటి, కాపులకు రెండు, మైనార్టీలకు 13 యూనిట్లు, నూలివీడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో బీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ ఒకటి, కాపులకు రెండు, మైనార్టీలకు 12 యూనిట్లు కేటాయించినట్లు ఆయన వివరించారు.

వంక పోరంబోకు కబ్జా వాస్తవమే!

● నిర్ధారించిన రెవెన్యూ అధికారులు



మైసూరివారిపల్లె వంక పోరంబోకు స్థలం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వంక పోరంబోకు స్థలాన్ని అమ్మేశారు అన్న శీర్షికతో ఈ నెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రైల్వేకోడూరు రెవెన్యూ శాఖ సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, గ్రామీణ సర్వేయర్ శ్రావణి ఇచ్చిన వివరాల మేరకు.. సర్వే నెంబరు 2085లో సమగ్రంగా సర్వే చేసి అందులో నాలుగు లెటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఒకటో లెటర్‌కు చెందిన 17.46 ఎకరాల భూమి ఏపీఐసీసీకి చెందినది కాగా, ఈ భూమిని ఆర్. శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి గతంలో కన్వ ర్షన్ చేయించుకుని విక్రయించారు. 2వ లెటర్‌లోని 33 సెంట్ల మామిడి తోట, 3వ లెటర్‌లోని 12.80 ఎకరాలు . 4వ లెటర్‌లోని 4.30 ఎకరాల్లో 1.20 ఎకరాలు కబ్జాకు గురైంది. కొంత భూమిని అధికా రులు బిస్మిల్లానగర్‌కు కేటాయించారు. మిగిలిన భూమిపై హైకోర్టు స్టే విధించింది. ఇందులోని స్థలాన్నే గత వైసీపీ హయాంలో ఈద్గాకు కేటాయించారు. కబ్జాకు గురికాలేదని, ఒక్క సెంటు విక్రయించినా రాజకీయ సన్యాసం చేస్తామని ఒక పార్టీ నాయకులు సవాల్ విసరడం తో పాటు, ఆమేరకు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం కూడా ఇచ్చారు. ఇటీవల ఈ స్థలం మీదుగా రోడ్డు కూడా వేశారు.

మామిడిలో సస్యరక్షణపై రైతులకు శిక్షణ

రామాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలం లోని రాచపల్లి, హసనాపురం గ్రామాల్లో సోమవారం ఉద్యా నశాఖ అధికారిణి టీ. నాగ మణి ఆధ్వర్యంలో మామిడి తోటల్లో పూత, పిందె సమ యంలో చేపట్టాల్సిన సస్యరక్ష ణ చర్యలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పచ్చిపూత దశలో ఆశించే తేనె మంచు పురుగు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు నివారణకు బుప్రోఫెజిన్ 1.5 మి.లీటరు నీటికి, కంటాఫ్ 2 మి.లీ నీటికి అజాడిరెక్టిన్ 2 మి.లీ నీటికి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. తెల్లపూత దశలో ఎలాంటి రసాయన మందులు పిచికారి చేయకూడదని తెలిపారు. మామిడి నల్లపూత దశ ఐనా పిందె బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనె మంచు పురుగు, తామర పురుగు, పక్షికన్ను తెగులు, పిందె రాలడం నివారణకు బుప్రోఫెజిన్ ఎసిఫేట్ 1 గ్రాము లీటలు నీటలికి సాఫ్ 2 గ్రాములు నీటికి, ప్లోనోఫిక్స్ 0.25 మి.లీ నీటికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మామిడి పిందెలు గోళీకాయ నుంచి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు పదేళ్లు పైబడిన చెట్లకు ప్రతి చెట్టుకు 1 కేజీ యూరియా, 750 గ్రాముల చొప్పున పొటాష్ భూమిలో వేసి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 15 రోజుకోసారి తడులు ఇవ్వాలని సూచించారు.

ఎన్‌ఆర్‌ఐ సహకారంతో క్రీడా మైదానం అభివృద్ధి

పుల్లంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కృష్ణంపల్లె ప్రాథమిక పాఠశాల క్రీడా మైదానానం అభివృద్ధికి పూర్వ విద్యార్థి ఎన్‌ఆర్‌ఐ ఎలమనేని రమేష్ 60 వేలు రూపాయలు అందజేశారు. ఈ మొత్తంతో ప్రాంగణంలో మట్టి తోలించి , పిల్లలు ఆడుకునేందుకు వీలుగా తయారు చేశారు. గ్రామానికి చెందిన న్యాయవాది బొక్కసం ఆర్కే పాఠశాల చుట్టూ 23 రకాల పండ్ల మొక్కలు తీసుకువచ్చి ఎంఈవో చక్రధర్‌రాజుతో నాటించారు. పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న దాతలందరినీ ఎంఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్, ఉపాధ్యాయుడు విశ్వనాథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి దళిత కుటుంబానికి సాగుభూమి ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ నందలూరు మండలం నల్ల తిమ్మయ్యగారిపల్లె గ్రామం అరుంధతివాడలో వంద దళిత కుటుంబాలుండగా, ఏ ఒక్కరికీ సాగు భూమి లేదని, గత ప్రభుత్వంలో సాగు భూమి ఇవ్వాలని అనేక దఫాలుగా ప్రభుత్వానికి అర్జీలు పట్టించుకోలేదన్నారు. పల్లె పక్కనే సర్వే నెంబర్ 293లో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని దాదాపు 100 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. ప్రస్తుతం కొందరు నాయకులు జేసీబీలతో చదును చేసి భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూములు కాపాడడంతోపాటు అర్హులైన పేదలందరికీ సాగు భూమి ఇవ్వాలని, లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ భూపోరాటం నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కమిటీ జిల్లా నాయకులు గంగాధర్, దళితులు కృష్ణయ్య, శంకరయ్య, యశ్వంత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం కేటాయించాలని రిలే దీక్షలు



రిలే దీక్షలు చేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, ప్రధాన కార్యదర్శి సాంబ, రైల్వేకోడూరు సీపీఐ ఇన్‌చార్జి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ పట్టణంలో పార్కింగ్‌కు స్థలం లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు తదితరాలను రోడ్డు పక్కనే నిలుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నరసయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లిక వెంకటరమణ, కోశాధి కారి కే. వెంకటరమణ, నాయకులు కటారి గోపాల్, చందు, బాలకిషోర్, ఆటో వర్కర్స్ నాయకులు పాల్గొన్నారు.

రేపు సద్గురు కాశినాయన ఆరాధనోత్సవాలు

సిద్దవటం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివునిపల్లె సమీపంలో సద్గురు కాశిరెడ్డినాయన 23వ ఆరాధనోత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 12న బుధవారం అశ్వత్థనారాయణస్వామి కల్యాణం, అన్నదానం, గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని పోటీలో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రూ 50 వేలు కడప జిల్లా జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ, పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, 2వ బహుమతి రూ.30 వేలు నారపురెడ్డి వెంకట రామసుబ్బారెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, మూడో బహుమతి రూ. 20 వేలు అను పుల్లయ్య, సుబ్బయ్య అందజేయనున్నారని తెలిపారు.

పెరటి తోటతో ఆరోగ్యకరమైన ఆహారం



కిచెన్ గార్డెన్ పనుల్లో విద్యార్థులు

సంబేపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పెరటితోటతో విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని రైతు సాధికార సంస్థ మండల కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ శ్రీదేవి తెలి పారు. సంస్థ సహకారంతో సంబేపల్లె ఉన్నత పాఠశాల ఆవరణంలో సేంద్రియ పెరటితోట ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి మాట్లాడు తూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన ఆకు కూరలను ఈ తోటలో పెంచుతామన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పెంచిన ఆకుకూరలతో విద్యార్థులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారం లభిస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులు తమ ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఏ నారాయణ, సీడీఎఫ్ వెంకటేశ్వర్లు, ఐసీఆర్‌పీ వనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించేలా సిద్ధం కావాలి

సుండుపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒత్తిడిని జయించేలా విద్యా ర్థులకు అవగాహన కల్పించా లని దేశ ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం నిర్వహిం చిన పరీక్ష పే చర్చ కార్య క్రమంలో ఉపాధ్యాయులు వి ద్యార్థులకు సూచించారు. మండల కేంద్రానికి సమీపంలోని గుట్టకింద రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ విద్యార్థులతో కలిసి ఆ సమావేశాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పప్పు దినుసులతో పోషక విలువలు



విద్యార్థులు తయారు చేసిన చిత్రాలు

పుల్లంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పప్పు దినుసులతో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఉపా ధ్యాయుడు రమణ తెలిపారు. ప్రపంచ పప్పుదినుసుల దినోత్సవం సందర్భంగా అ వాయిపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో పప్పుదినుసులతో భారతదేశ చిత్రపటం, జాతీయజెండా, పుష్పాలు, పండ్లు, సూరుడు తదితర చిత్రాలను తయారు చేయించి ఏఏ పప్పు దినుసులో ఏయే పోషక విలువలు ఉంటాయో వివరించారు. పప్పు దినుసులు చౌకగా వస్తాయని, వాటిని నిల్వ చేయడం సులభమని, వీటి ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు.

'అన్నమాచార్య'లో రక్తదాన శిబిరం

రాజంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీ ప్రాంగణంలో రాజంపేట ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి, అన్నమాచార్య యూనివర్సిటీ ప్రభుత్వ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ నాగేశ్వర్‌రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుభశ్రీ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఏఐటీఎస్ రాజంపేట ప్రిన్సి పాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్.ఓబుళపతి రక్తదానం ఆవశ్యకతను తెలియజేశారు. .

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

రామాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో వెలసిన మరకత శివలింగం ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శివపార్వతుల కల్యాణం నిర్వహిం చారు. భక్తులకు అన్నదానం చేశారు. మన్నేరి రాధాకృష్ణ, విజయ లక్ష్మి, మన్నేరి శివశంకర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ మైండ్స్

- వారి ఆలోచనే సేవకు మూలం
- ఆరుగురితో మొదలై 18 వేలకు చేరిన సంఖ్య
- కరోనాలో 917 మృతదేహాలకు అంత్యక్రియలు



పెళ్లిలో రక్తదానం చేస్తున్న అబూబకర్ సిద్దిక్ (ఫైల్)



కరోనాలో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు (ఫైల్)



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

పెద్దమండ్యం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వారి ఆలోచనే సేవకు మూలం. ఎదుటి వారికి సహాయం చేయాలన్న తలంపే 'హెల్పింగ్‌మైండ్స్'గా రూపాంతరం చెందింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సేవ చేయాలన్న ఆలోచనతో రక్తదానంతో మొదలైన సేవ రక్తం కోసం వెదికేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించే వరకు వెళ్లింది. ఫలితంగా ఏ ప్రాంతంలో ఉన్న వారికి రక్తం అవసరమన్నా యాప్ ద్వారా పొందవచ్చు. ఫలితంగా సేవకులు ఆపద్బాంధవులుగా కొనియాడబడుతున్నారు. 2013 ఏప్రిల్ 7వ తేదీ ఆరుగురితో మొదలైన హెల్పింగ్‌మైండ్స్ ప్రయాణంలో ప్రస్తుతం 18 వేల మంది సభ్యులు, 25 వేల మంది రక్తదాతలు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్నగా చెప్పవచ్చు. ఎందుకంటే రక్తదానం ప్రాణదానంతో సమానం కాబట్టి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేకపోవడంతో అనేకమంది మృత్యువాతపడుతున్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు తమ వంతుగా రక్తాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం సొంత బంధువులకు కూడా సాయం చేసేందుకు వెనకడుగు వేస్తున్న పరిస్థితుల్లో మేమున్నామని భరోసా ఇస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతూ అందరి చేత ప్రశంసలను అందుకుంటున్నారు. చాలామంది ఒకటి, రెండు, మూడుసార్లు రక్త దానం చేసి ఉంటారు. కానీ హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు అయితే కొందరు 40 సార్లకు పైగా రక్తదానాలు చేసి ప్రజల ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచారు. మదనపల్లిలోని 'హెల్పింగ్ మైండ్స్' సభ్యులు రక్తదానం చేయడమే కాకుండా రక్తదాన శిబిరాలు సైతం ఏర్పాటు చేయడం దేశవ్యాప్తంగా రక్తం అవసరాలను దృష్టిలో ఉంచుకుని గూగుల్ ప్లేస్టోర్‌లో హెల్పింగ్ మైండ్స్ సొసైటీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందులో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చే ప్రతిఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఏ ప్రాంతంలో రక్తం అవసరం ఉంటుందో ఆ ప్రాంతాల వారు యాప్ ద్వారా రక్తదాతలను గుర్తించి సాయం పొందేలా రూపొందించారు. హెల్పింగ్ మైండ్స్ సంస్థకు కరోనా సమయంలో సేవలకు ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అప్పుడు మదనపల్లి టీడీపీ నేతల ద్వారా ప్రశంసాపత్రం అందజేశారు.



జాతీయ రక్తదాన దినోత్సవం రోజు రక్తదానం చేస్తున్న పోలీసులు, సంస్థ సభ్యులు (ఫైల్)

హెల్పింగ్ మైండ్స్ సేవలు విస్తృతం

హెల్పింగ్ మైండ్స్ సభ్యులు మరిన్ని సేవలను విస్తృతం చేశారు. ప్రధానంగా కరోనా సమయంలో కరోనాకు భయపడి బంధువులకు దూరమైన 917 మృతదేహాలకు వారి సంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. చదువుకునే వయస్సులో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వేసవి వచ్చిందంటే దాహార్తి తీర్చడానికి అవసరమైన చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో అడవిలో జీవులు మరణించకూడదని వందల సంఖ్యలో తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపుతున్నారు. హిందువుల ముఖ్యమైన పండుగల్లో వినాయకచవితి సందర్భంలో ఏటా భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు అందజేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. సీజన్‌లో అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులకు ఆనవాయితీగా అన్నదానం కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిరుపేదలకు గుప్పెడు అన్నం అందించడానికి మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్, గుర్రంకొండల్లో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. రోజూ వందమందికి అక్కడ ఫ్రీహబ్‌లలో ఆహార పొట్లాలు ఉంచుతారు. గృహ శుభాకార్యాలు, పుట్టినరోజులు, పెళ్లిళ్లు మిగిలిన అన్ని రకాల కార్యక్రమాల్లో మిగిలిన అన్నం పొట్లాలు నిల్వ చేస్తారు. నిరుపేదలు ఆకలితో ఉండకూడదన్న హెల్పింగ్ మైండ్స్ లక్ష్యం విజయవంతంగా నడుస్తోంది. చలికాలంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ సేవలు సాగుతున్నాయి. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా విగ్గులు అందజేస్తున్నారు. దేశవ్యాప్తంగా హెల్పింగ్ మైండ్స్ సంస్థ సేవలు విస్తరించి రాయలసీమకే వన్నె తెచ్చారు. వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని హెల్పింగ్ మైండ్స్ సంస్థ కోరుకోవడం విశేషం.

పెళ్లిలో కూడా రక్తదానం

మదనపల్లిలో స్థిరపడిన హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన అబూబకర్ సిద్ధిక్ పెళ్లిలో కూడా రక్తదానం చేయడం విశేషం. వివాహ సమయంలో పెళ్లి కుమారుడు సహా మరో 52 మంది సభ్యులు రక్తదానం చేసిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఏ ఒక్కరి ప్రాణం పోకూడదు



రక్తం అందుబాటులో లేకపోడం వల్ల ఏ ఒక్కరూ మృత్యువాతపడకూడదన్న లక్ష్యంతోనే పదేళ్ల కిందట హెల్పింగ్ మైండ్స్ రక్తదాతల సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో వేల సంఖ్యలో దాతలు చేరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, అన్నమయ్య, కడప బెంగళూరు, తిరుపతి, పంజాబ్, హైదరాబాదు నగరాలు సహా పలు ప్రాంతాల్లో హెల్పింగ్ మైండ్స్ సేవలు విస్తరించాం ఈ సంస్థ ద్వారా 25 వేల మందికి రక్తదానం చేశాం. గూగుల్ ప్లేస్టోర్‌లో యాప్‌ను తయారు చేశాం. ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేశాను. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సాయం అందివ్వాలి. కరోనా సమయంలో ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసాపత్రం ఇవ్వడం మరవలేనిది.

-అబూబకర్ సిద్ధిక్,
హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు, మదనపల్లి.

గంజాయి గుట్టురట్టు...

- 2.25 కిలోల గంజాయి సీజ్
- ఆరుగురు అరెస్టు
- 5సెల్‌ఫోన్‌లు, రూ.20వేలు నగదు స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఎట్టకేలకు గంజాయి గుట్టు రట్టు అయింది. గత మూడు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన గంజాయి పీల్చేస్తున్నారు అన్న కథనంపై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. ఆ మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో వాల్మీకిపురం పోలీసులు గత రెండు రోజుల పాటు విస్తృత దాడులు నిర్వహించారు. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లకు వచ్చిన రహస్య సమాచారంతో రెండు రోజుల నుంచి ముమ్మర నిఘా చేపట్టడంతో గంజాయి గుట్టు రట్టయింది. పట్టణ శివారులోనే ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు కానీ విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులను పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకోవడం గమనార్హం. స్థానిక సాకలవారిబండకు చెందిన కాలపల్లె అంజమ్మ(54), ఇందిరమ్మ కాలనీకి చెందిన సయ్యద్ ఖలీల్(43),దయ్యాలడండకు చెందిన ఎస్.సమీర్(34), కత్తి సిద్దార్థ(19), నమాజ్‌కట్టవీధికి చెందిన నిమ్మనపల్లె కిరణ్(19)లతో పాటు మరో యువ కుడు ఆదివారం మధ్యాహ్నం పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీ పంలో గుంపుగా ఉండటం అనుమానించిన పోలీసులు వారి వద్దగల ప్లాస్టిక్ సంచులను చోదా చేయడంతో గంజాయి విక్రయాల విషయం బయట పడింది. ఈ తనిఖీలలో 2.250 కేజీల గంజాయిని సీజ్ చేస్తూ 5సెల్‌ఫోన్లు, రూ.20వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టుబడ్డ వ్యక్తులలో మహిళ బయటి ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకు వచ్చి వాల్మీకిపురం ప్రాంతం చుట్టుపక్కల విక్రయాలు కొనసాగిస్తున్నట్లు పోలీ సుల విచారణలో తేలింది. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. ఈ దాడులలో అదనపు ఎస్ఐ శ్రీహరి, ఏఎస్ఐ కరీముల్లాసాహెబ్, హెడ్‌కానిస్టేబుళ్లు వేణుగోపాల్, దస్తగిరి, ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, సిబ్బంది అబ్దుల్లా, లక్ష్మీపతి, రెడ్డిప్రసాద్, శివకుమార్, నరేష్, గిరిబాబు, బాబాప్రసాద్, రిజ్వాన్, నల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి..

మాదక ద్రవ్యాల విషయంలో యువత పెడదోవ పట్టి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారి పట్ల తల్లిదండ్రులు తప్పక బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. తమ కష్టాలతో వ్యవప్రయాసలు పడి పిల్లల భవిష్యత్తు కోసం అన్నీ సమకూర్చే తల్లిదండ్రులు పిల్లలు ఎటు పోతున్నారో ఏమి చేస్తున్నారు విషయాల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. చదువు విషయంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారా ఏమిచేస్తున్నారు, ఎలా చదువుకుంటు న్నారన్న వాటిపై పర్యవేక్షణ లేకపోతే తర్వాత బాధపడాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలలో గంజాయి విక్రయాలు, వాటిని సేవించే వారు ఎంతటి వారైనా ఇకపై ఉపేక్షించేది ఉండదని చట్టరీ త్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాజంలో ప్రజలంతా కూడా బాధ్యత ఎరిగి ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

- తిరుచ్చిపై తిరుమాడ వీధులలో నగరోత్సవం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో సోమవారం పునర్వసు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. అనంతరం హోమాది కార్యక్రమాలు పూర్ణాహుతి గావించి వేడుకలు పూర్తి చేశారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయం త్రం భోగోత్సవమూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై అలంక రణలు గావించి తిరుమాఢ వీదులలో నగరోత్సవం నిర్వహించారు.



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఈ కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు బాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 16 మందికి జరిమానా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన షేక్. జాఫర్, తులసి ప్రసాద్, శైకలియాస్, సైడ్ సాయివల్లితోపాటు మరో 12 మందిని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పర్చగా మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10,500లు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారని వివరించారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి కృష్ణప్ప (62) అనే వృద్ధుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, పొన్నూటి పాలెం మోట్లపల్లెకు చెందిన కృష్ణప్ప కూలీ పనులకు వెళుతూ పనసమాకులపల్లెలో ఒక రోజు ఒక్కో ఇంట్లో భోజనాలు చేస్తూ జీవిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగే అలవాటు ఉండడంతో వారం నుంచి కనపడడంలేదని తెలిపా రు. సోమవారం కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోర్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతనికి కుమారుడు శంకర్, మనుమడు ఉన్నట్లు తెలిపారు.



మృతుడు కృష్ణప్ప (ఫైల్)

విజయవంతంగా ఎస్‌డీడీ ప్రోగ్రాం

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్‌డీడీఆ (జాతీయ నులిపురుగుల నిర్మూలన) కార్యక్రమం విజయవంతం అయ్యిందని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ తెలిపారు. రాయచోటిలోని మాసాపేట-3 అంగన్వాడీ కేంద్రంలో, విశ్వభారతి స్కూల్‌లో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 97.25 శాతం మాత్రల పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. పాఠశాలకు గైర్హాజరు అయిన విద్యార్థులకు ఈ నెల మాప్ ఆఫ్ రౌండ్‌లో మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నరసింహా, ఏఎన్‌యం సలీమా, అంగన్వాడీ టీచర్ ఇర్షాద్‌బేగం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

కళ తప్పిన నాటకరంగం

- అలనాటి తోలుబొమ్మలాట, వీధి భాగవతాలకు ఆదరణ కరువు
- జీవనోపాధి కోల్పోయిన కళాకారులు
- పెన్షన్ మంజూరు కాలేదంటూ ఆవేదన

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల క్రితం ప్రజలకు వినోదాన్ని పంచిపెట్టింది తోలుబొమ్మలాట.తొలుబొమ్మలాట, నాటక ప్రదర్శన అన్నా ప్రజలు తమ పనులను వదిలి చూసేందుకు వెళ్లేవారు. కళాకారులు కూడా వైభవంగా వెలుగుతూ ఉండేవారు. కాలక్రమేణా సినిమాలు, సీరియళ్లు మొదలయ్యాక నాటకరంగం ఆదరణ కోల్పోయింది. ప్రస్తుత ఆధునిక యుగంలో నాటకరంగం పూర్తిగా అంతరించిపోయింది. దీంతో పూర్తిగా కళాకారులు నాటక ప్రదర్శనలు లేక ప్రభుత్వాల నుంచి ఆదరణ కరువై జీవచ్ఛవంలా బతుకుతున్నారు. ఈ క్రమంలో బద్వేలు పట్టణ సమీపంలోని చెన్నంపల్లె గ్రామంలో తొలుబొమ్మలాటగాళ్లు, నాటకరంగ కళాకారులుగా ఒక వెలుగువెలిగి, ప్రస్తుతం ఉపాధికోల్పోయిన వారి జీవన శైలిపై ప్రత్యేక కథనం.

తరతరాలుగా నాటకరంగ కళాకారులు

బద్వేలు పట్టణం సమీపంలో ఉన్న చెన్నంపల్లె గ్రామంలో తరతరాలుగా నాటకరంగ కళాకారులు కొనసాగుతున్నారు. తోలుబొమ్మలాట, వీధి బాగవతాలు,భారతం వంటి నాటకాలను ప్రదర్శిస్తూ జీవనాన్ని కొనసాగించారు. ఒకప్పుడు నాటకరంగానికి మంచి ఆదరణ ఉన్నప్పుడు వెలిగిపోయిన ఆకుటుంబాలు, ప్రస్తుతం జీవనాన్ని కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాయి.



తోలుబొమ్మలాటలో ప్రదర్శించే తోలుబొమ్మలు

మహారాష్ట్ర నుంచి వలస

మహారాష్ట్రలోని మరాఠాకులానికి చెందిన కాళే అప్పారావు కుటుంబీకులు కొన్నివందల సంవత్సరాల క్రితం కడప జిల్లాకు వలసవచ్చారు. ఉమ్మడి కడపజిల్లాలోని ఒంటిమిట్ట సమీపంలోని సీతాపురం గ్రామంలో స్థిరపడగా, అక్కడి నుంచి బద్వేలు పట్టణ సమీపంలోని చెన్నంపల్లెకు మరికొన్ని కుటుంబాలు వచ్చి స్థిరపడ్డాయి. అప్పటి నుంచి నాటకరంగాన్నే నమ్ముకొని నాటకప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచిపెడుతున్నారు. కుటుంబంలో పెద్దలందరూ చనిపోగా, ప్రస్తుతం కాళే శ్రీనివాసరావు, వనపర్తి శాంతిరావు కుటుంబసభ్యులు ప్రస్తుతం నాటకప్రదర్శనలను కొనసాగిస్తున్నారు.


తోలుబొమ్మలాటలో అందవేసిన చెయ్యి

అంతరించిపోయిన తొలుబొమ్మలాటలో చెన్నంపల్లె గ్రామానికి చెందిన కుమార వెంకటయ్య పూర్వీకులు అందెవేసిన చెయ్యిగా పేరుగాంచారు. తోలుబొమ్మలాటలో కుమార క్రిష్ణారావు, వెంకటరావు, సుబ్బారావు తదితరులు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. వారి వారసులు కుమార వెంకటయ్య ప్రస్తుతం కూడా తోలుబొమ్మలాట ప్రదర్శనలనే నమ్ముకొని జీవిస్తున్నారు. అయితే తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ఎక్కడా ఆదరణ లేకపోవడంతో ప్రస్తుతానికి ఇంటి వద్దే ఖాళీగా ఉన్నారు.

పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు

రాయలసీమలోని కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లా లేకాక, నెల్లూరు, ప్రకాశం, క్రిష్టా జిల్లాల్లో నాటకప్రదర్శనలు చేశామంటున్నారు చెన్నంపల్లె కళాకారులు. అప్పట్లో తమ నాటకప్రదర్శనలను చూసేందుకు తండోప తండాలుగా ప్రజలు వచ్చేవారని, ప్రస్తుతం నాటక ప్రదర్శనలు ఉన్నా, వయస్సు పైబడిన వృద్ధులు, మధ్యవయస్కులు తప్ప కుర్రకారుకు నాటక ప్రదర్శనపై ఆసక్తిలేదంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాటకరంగానికి ప్రస్తుతం ఆదరణ లేకపోవడంతో కుటుంబపోషణకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తర తరాలుగా నాటకరంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రస్తుతం జీవనానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి. కళాకారుల పెన్షన్ మంజూరైతే కొంత మేర ఇబ్బందులు తొలుగుతాయి.

- కాళే శ్రీనివాసరావు, నాటకరంగ కళాకారుడు, చెన్నంపల్లె.


కళాకారులకు పెన్షన్ మంజూరు కాలేదు



ఎన్నో ఏళ్లుగా నాటకరంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. ఇన్నేళ్లుగా కళారంగానికి సేవచేసినా మాకు కళాకారులకు ఇచ్చే పెన్షన్ మంజూరు కాలేదు. ప్రభుత్వం కళాకారుల పెన్షన్‌ను మంజూరు చేయాలి.

- కాళే మౌలమ్మ, మహిళా కళాకారిణి, చెన్నంపల్లె.

ఆదరణ కోల్పోయాం ఆదుకోండి



తాత ముత్తాల కాలం నుంచి తోలుబొమ్మలాటనే నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రస్తుతం తోలుబొమ్మలాట పూర్తిగా ఆదరణ కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కళాకారులకు చేయూతనందించాలి. కళాకారుల పెన్షన్ మంజూరైతే జీవనానికి ఇబ్బంది కలగదు.

-కుమార వెంకటయ్య,
తోలుబొమ్మలాట కళాకారుడు, చెన్నంపల్లె.

ఉద్యోగ నియామకాల్లో ఇష్టారాజ్యం

- ప్యాక్స్‌లో అమలుకాని రోస్టర్
- నష్టపోతున్న బలహీన వర్గాలు



కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో భారత రాజ్యాంగం ప్రకారం పక్కాగా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని శాఖల్లో ఈ విధానం అమలు కానట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు శాఖల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టే ఉద్యోగ నియామకాల్లో సక్రమంగా రిజర్వేషన్లను అమలు చేయలేకపోవడంతో బలహీనవర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సహకారశాఖలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో (పీఏసీఎస్) ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసే క్రమంలో పక్కాగా రోస్టర్‌ను అమలు చేయకపోవడంతో రిజర్వేషన్లు అమలు కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగానికి సేవలందించేందుకు సహకార శాఖ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలను నిర్వహిస్తోంది. ఇందులోని సిబ్బందిని పాలకవర్గం నియమించాల్సి ఉంటుంది. అయితే పలుచోట్ల నియామకాల్లో రోస్టర్ పద్ధతిని అమలు చేయకపోవడం, తమ అనుయాయులను నియమించుకోవడం కోసం పాలకవర్గాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సొసైటీలో పనిచేస్తున్న సిబ్బంది పదవీ విరమణ చెందితే ఆ ఖాళీలను భర్తీచేసే క్రమంలో కొన్నిచోట్ల అక్రమాలకు కూడా పాల్పడుతున్నట్లు చర్చ సాగుతోంది.

నిబంధనలకు నీళ్లు

జిల్లాలో గత కొంతకాలంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల్లో చేపడుతున్న నియామకాల్లో నిబంధనలు పాటించడం లేదని సమాచారం. 1964లోని రూల్ 5లోని 24వ ఉప నిబంధన ప్రకారం కాకుండా రిక్రూట్‌మెంట్ పద్ధతిని ఇష్టానుసారంగా చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఏదైన ఒక ఖాళీని భర్తీ చేసేందుకు మొదట తాత్కాలిక పద్ధతిన నియమించి ఆ తర్వాత క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం అంతా జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా చేపట్టాల్సి ఉంది. ఇదిలా ఉంటే రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు వారి వ్యాపార స్థాయిల ప్రకారం ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుంది. పీఏసీఎస్‌లలో ఒక సీఈఓ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్, సబ్ స్టాఫ్ క్యాడర్‌గా పోస్టులను విభజించారు. ఇందులో సీఈఓ పోస్టుకు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలి. అదేవిధంగా కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పొసై ఉండాలి. కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కు కంప్యూటర్ ప్రావీణ్యంతో పాటు డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి. సబ్‌స్టాఫ్ పోస్టులకు సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. ఏదైన ఒక సొసైటీలో ఖాళీలు ఏర్పడితే వాటి నియామకానికి పీఏసీఎస్ తరపున జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీకి నివేదించాల్సి ఉంది. ఒక జిల్లాలోని సొసైటీలో ఏర్పడే సీఈఓ పోస్టులకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులలో ఉన్న వారి ద్వారా 25శాతం మేర ఖాళీలు భర్తీచేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ పోస్టుకు అర్హులైన వారు సొసైటీలో లేకపోతే సొసైటీ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా ఖాళీలను నేరుగా భర్తీచేసేందుకు రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి సీఈఓలు, ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కు బదిలీలు తప్పనిసరి. జిల్లాలోని కొన్ని సొసైటీలలో అర్హులు ఉన్నప్పటికీ వారికి పదోన్నతి కల్పించేందుకు పాలకవర్గాల పెద్దలు సహకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నట్లు కూడా చర్చ సాగుతోంది.

పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో...

సొసైటీలోని సీఈఓలు సబ్ ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ పోస్టులు మినహా సబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి నియామకాలు చేపట్టడం తప్పనిసరి. సాధారణంగా సబ్‌స్ట్రైబ్ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం స్థానిక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా వచ్చిన జాబితా ఆధారంగా నియామకాలు జరపాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు చేపట్టిన చాలా వరకు సొసైటీల్లో ఇవేవీ పాటించనట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఖాళీల భర్తీలో రోస్టర్‌ను అమలు చేయాల్సి ఉండగా పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో అర్హులైన బడుగు బలహీన వర్గాల ప్రజలు నష్టపోతున్నట్లు సమాచారం. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా వచ్చిన జాబితాతో పాటు సొసైటీ కార్యకలాపాల ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఏ ఏ పోస్టు లు ఉండే విషయం కూడా ఎవరికీ అంతుచిక్కని విషయం. దీంతో అక్కడ పోస్టుల భర్తీ గురించి కూడా పెద్దగా ఎవరికి అవగాహన లేకపోవడంతో కొన్ని సొసైటీల్లోని సిబ్బంది పాలకవర్గాల కనుసన్నల్లో నియామక వ్యవహారం జరిగిపోతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 77ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేసేవి. జిల్లా విభజన తర్వాత వాటి సంఖ్య 51కి పడిపోయాయి. ఇప్పటి వరకు ఎన్ని సొసైటీల్లో ఖాళీలు ఉన్నాయనే విషయం కూడా జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌కి సమాచారం లేదు. దీన్ని బట్టి చూస్తే సొసైటీల ఉద్యోగుల ఖాళీలు భర్తీలో సహకార చట్టంలోని నిబంధనలు పాటించడం లేదనేది స్పష్టమవుతుంది.

ఎటువంటి లేఖలు అందలేదు



ఈ విషయమై జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సాధారణంగా ఒక పోస్టుకు 20 మంది లెక్కన జాబితా అడుగుతారు. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఖాళీల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి లేఖలు మాకు అందలేదు.

మదనపల్లెలో ఉద్రిక్తత

- మోహరించిన ఇరువర్గాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు
- పోలీసుల రాకతో వెనుతిరిగిన వైనం



మదనపల్లె పట్టణం రింగురోడ్డులో శ్రీరామ్‌చినబాబు, ఆయన అనుచరులు

మదనపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో టీడీపీ వర్గీయుల మధ్య చిన్న వివాదం ఒక్కసారిగా ఉద్రిక్తతగా మారింది. ఇరువర్గాల అనుచరులు ఒకే చోటకు వెళ్లేందుకు సిద్ధం కావడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఎట్టకేలకు పోలీసులు రావడంతో ఇరువర్గీయులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే..తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు సోమవారం రాత్రి స్థానిక రింగురోడ్డులోని ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చేందుకు ఇంటి నుంచి బయలు దేరారు. ఈ క్రమంలో ఆ యూట్యూబ్ ఛానల్ కార్యాలయం వద్ద కొంతమంది వ్యక్తులు గుమికూడి ఉండటంతో చినబాబు అనుచరులు అప్రమత్తం అయ్యారు. చినబాబుపై దాడి చేసేందుకు ఎవరో వచ్చారని వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న శ్రీరామ్‌చినబాబు అనుచరులు పెద్దసంఖ్యలో ఆ ఛానల్ కార్యాలయం వద్దకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దసంఖ్యలో సైరన్లు మోగించుకుంటూ జీపుల్లో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకతో ఇరువర్గాలకు చెందిన టీడీపీ వర్గీయులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. నెల రోజులుగా మదనపల్లెలో టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య వివాదం చిలికిచిలికి గాలివానగా మారుతుండటంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని మదనపల్లె ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టీడీపీ అధిష్ఠానం, పోలీసులు టీడీపీకి చెందిన రెండు వర్గాలను కంట్రోల్ చేయకుంటే పార్టీకి, ప్రజలకు పెద్ద నష్టమే జరిగే అవకాశముందని టీడీపీ శ్రేయోభిలాషులు స్పష్టం చేస్తున్నారు.

ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల బృందం పరిశీలన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారుల బృందం పరిశీలించారు. ఆస్పత్రిలోని పరికరాలను, వసతులను అంచనా వేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్యవరం వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించారు. ఏఏ విభాగ భవనాల నిర్మాణాలు ఏ స్టేజ్‌లో ఉన్నాయో గమనించారు.

బైకును ఢీకొన్న కారు.. తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

బి.కొత్తకోట ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండల పరిధిలోని పూలకుంటపల్లెకు చెందిన రామాంజులు తన కుమారుడు విష్ణుతేజ్ (17)ను కురబలకోట మండలం లోని చేనేతనగర్ వద్దనున్న గురుకుల పాఠశాలలో వదిలేందుకు స్వగ్రామం నుంచి తన ద్విచక్రవాహనంలో బయలేదేరాడు. బి.కొత్తకోట మండల పరిధిలోని జాతీయ రహదారిలో గోళ్లపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఓ కారు వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులు ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా వారు మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు.

అంగళ్లులో వైభవంగా ఉరుసు

కురబలకోట, ఫిబ్రవరి 10: మండలంలోని అంగళ్ళులో రెండు రోజుల ఉరుసు మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. హజ్రత్ సయ్యదినా షేక్ అబ్దులా ఖాదర్ జిలానీ పీరానెపీర్ గౌసుల్ అజం దస్తగిర్ ఉరుసులో భాగంగా గంధోత్సవ, ఖవ్వాలి వేడుకలను నిర్వహించారు. కడప ముతవల్లి రాస్తాని మగ్దుమ్ ముల్లాయి పాల్గొని ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. కాగా ముంబై, మైసూరుకు చెందిన గాయకులు ఖవ్వాలిలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి ఖవ్వాలి పలువురిని ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఏపీవోగా మాధవి

రామసముద్రం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథక మండల ఏపీవోగా మాధవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిన్నమండ్యం నుంచి బదిలీపై రామసముద్రంకు వచ్చినట్లు మాధవి తెలిపారు. కాగా, ఇక్కడ పని చేస్తు న్న ఏపీవో గౌరీశంకర్ బదిలీపై పలమనేరు నియోజకవర్గం వి.కోటకు బదిలీపై వెళ్లారు.

పకడ్బందీగా రీసర్వే పనులు నిర్వహించండి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెలిగల్లు, బండమీదపల్లి గ్రామాలలో పకడ్బందీగా రీసర్వే పనులు నిర్వహించాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో సోమవారం రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

పులివెందులలో ఘర్షణ

- తాగిన మత్తులో ఓ నాయకుని కొడుకు హల్‌చల్

పులివెందుల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో పడగొట్టిన బస్టాండ్ సమీపంలో ఘర్షణ చోటుచేసుకుంది. తాగిన మత్తులో ఓ పార్టీకి చెందిన నాయకుడి కొడుకు హల్‌చల్ చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాల్లోకెళితే... అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం తిమ్మాపురానికి చెందిన వారు కడప వైపు నుంచి కారులో బస్టాండ్ సమీపానికి చేరుకున్నారు. కారుకు పాదచారి అడ్డురావడంతో కారు ఒక్కసారిగా బ్రేక్ వేశారు. కారు వెనుకలే వస్తున్న ఓ నాయకుడి కొడుకు బైకుపై వచ్చి కారును వెనుకవైపున ఢీకొట్టాడు. ఉన్నట్లుండి కారు ఆపితే వెనుకవచ్చేవారు ఏమవుతారని వారిపై మండిపడ్డారు. వెంటనే కారు నడుపుతున్న వ్యక్తిపై దాడికి దిగాడు. కారులో ఉన్న వారు ప్రతిఘటించినా వారిపై కూడా దాడికి ప్రయత్నించాడు. ఇంతలో అటుగా వెళ్తున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఏమి జరిగిందని ఆరా తీసేలోపు ఆ యువకుడు కారులో ఉన్న వారిపై మరోసారి దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఆ యువకుడిని గట్టిగా ప్రతిఘటించారు. దీంతో ఆ యువకుడు సహనం కోల్పోయి పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ యువకుడు కారులో ప్రయాణిస్తున్న వారికి జరిగిన సంఘటన విషయమై అతని బంధువులు, యువకుడు సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

కోవరంగుట్టపల్లిలో ఉద్యోగి ఆత్మహత్య.



పెద్దన్న (ఫైల్‌ఫొటో)

సింహాద్రిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవరంగుట్టపల్లిలో సోమవారం చింతపండు పెద్దన్న (55) అనే ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దన్న తొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లర్క్‌గా విధులు నిర్వహించేవాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దన్న మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్దన్ (32) ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సిద్దవ టం మండలం పాలకొండ్రాయునిపల్లెకు చెందిన జనార్దన్ 6వ తేదీ ఉదయం జమాల్‌పల్లె వద్ద ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కడప రిమ్స్‌లో చికిత్స పొంది తూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి కుప్పాల యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

13 మంది జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం 34 వవార్డు దేవాంగపేటలోని జ్యోతి నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంటిలో జూదం ఆడుతున్న 13 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.65,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన జూదరులలో పోసా శ్రీనివాసులు అలియాస్ ఉంగరాల శ్రీను, హరీష్, మచ్చా నాగేంద్ర, కాళహస్తి శేషు తదితరులు వున్నారు. వీరిపై కేసు నమోదు చేసి వ్యక్తి గత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీ



కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం పోలీసులు లాడ్జీల తనిఖీ చేపట్టారు. లాడ్జీల్లో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించి బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. అనంతరం లాడ్జిల్లోని రిజిస్టరును పరిశీలించారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జిల నిర్వాహికులు అనుమానితులను గుర్తిస్తూ వెంటనే పోలీసులకు సమాచరం అందివ్వాలన్నారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

యువతి అదృశ్యం



కడప క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బుడ్డాయపల్లెలోని టెలికాంనగర్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన చింతకుంట భవిష్య (30) అనే యువతి అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసుస్టేషన్ ఎస్ఐ తెలిపా రు. యువతి బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు మోదు చే సి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121100523, 9121100524 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్‌డే



డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్ దినోత్సవం ఉండాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో డీన్‌లు, అన్ని శాఖల విభాగాధిపతులతో సైన్స్ దినోత్సవ నిర్వహణపై సోమవారం ఉపకులపతి తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. 28వ తేదీ సైన్స్ డే నిర్వహణపై అభిప్రాయాలను స్వీకరించారు. దేశంలో ప్రఖ్యాతిగాంచిన సైన్స్ పరిశోధకులను ఆహ్వానించి ఉపన్యాసం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే విద్యార్థుల్లో, పరిశోధకులలో లోతైన పరిశోధన అవగాహన కోసం పోస్టర్ ప్రజెంటేషన్ చేయనున్నారు. ఇందులో అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, డీన్లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య కె.గంగయ్య, అన్ని శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైవీయూ దూరవిద్యలో

కూచిపూడి భరతనాట్యం సర్టిఫికెట్ కోర్సులు

యోగివేమన విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం (సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్) ద్వారా కూచిపూడి, భరతనాట్యం కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌బాబు, ధర్మవరం కూచిపూడి కళా కేంద్రం కార్యదర్శి కె.ఎల్.కళ్యాణ్ చక్రవర్తి, అధ్యక్షులు కె.మంజుల, గౌరవ సలహాదారు నటరాజ కృష్ణమూర్తి సంతకాలు చేశారు. వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయు ద్వారా ఏడాది వ్యవధి గల సర్టిఫికేట్ కోర్సులు దూరవిద్య ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. కళారంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ కోర్సులను దూరవిద్య ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలిసి విడుదల చేశారు. సోమవారం వైవీయులోని తమ చాంబర్‌లో ఫలితాలను వీసీ పరిశీలించారు. ఫస్ట్ ఇయర్‌లో 63.36శాతం, మూడో సెమిస్టర్‌లో అన్ని గ్రూపులు కలుపుకొని 63.39శాతం ఫలితం నమోదైందన్నారు. ఐదో సెమిస్టర్‌కు సంబంధించి అన్ని గ్రూపులు కలిపి 77.83శాతం ఫలితాలు నమోదయ్యాయన్నారు. సహ పరీక్షల అధికారులు డాక్టర్ మమతకుమారి, డాక్టర్ కనుసు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళల హాకీ చాంపియన్ కడప



చాంపియన్‌గా నిలిచి కప్ అందుకుంటున్న కడప జిల్లా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 15వ ఏపీ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో కడప జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా కడప జట్టు ఉత్తమ ప్రదర్శనతో 2-0 గోల్స్ తేడాతో చాంపియన్‌గా నిలిచింది. అనంతపురం ద్వితీయస్థానం సాధించింది. అలాగే మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ, అనకాపల్లి జట్లు తలపడగా కాకినాడ 7-1 గోల్స్‌తో మూడో స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్‌పీటర్ విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రథమస్థానంలో నిలిచిన కడప జట్టుకు ట్రోఫీతోపాటు రూ.7వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీ, రూ.5వేలు, తృతీయస్థానంలో నిలిచిన కాకినాడ జట్టుకు ట్రోఫీ రూ.3వేలు నగదు అందచేశారు. అలాగే ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా క్రీడాకారిణి నందినికి, ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచిన కాకినాడ క్రీడాకారిణి వరాలమ్మకు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురం జిల్లా క్రీడాకారిణి లక్ష్మీలకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ జోనాతాన్, సీనియర్ క్రీడాకారులు నవీన్, పోటీల నిర్వాహక కార్యదర్శి థామస్‌పీటర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు జీడీ.సురేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో దొంగల బీభత్సం

- రూ.1.30 లక్షలు నగదు, 5తులాల బంగారు, కేజిన్నర వెండి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న డీఎస్పీ



డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. కాలనీ నడిబొడ్డులో ఏఈలు నివాసం ఉండే ఈ బ్లాక్‌లో ఈ చోరీలకు పాల్పడ్డారు. వివరాలిలా... ఆర్టీపీపీలో ఇంజినీర్స్ నివాసం ఉండే 'ఈ' టైప్ క్వార్టర్స్ ఈ 338, 96, 112, 207, 213, 214 క్వార్టర్స్‌లో ఇళ్ల తాళం కింద వుండే కొండీని తొలగించి చోరీ చేశారు. 338 ఇంటిలో ఉంటున్న ఏఈ పద్మజ శుక్రవారం సాయంత్రం కుటుంబంతో కలసి పులివెందులకు వెళ్లింది. చోరీ జరిగినట్లు సమాచారం రావడంతో ఆమె సోమవారం ఉదయం హుటాహుటిన ఆర్టీపీపీకి వచ్చారు. ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.1.30లక్షల నగదు, 5తులాల బంగారు ఆభరణాలు, వెండి చెంబు, ప్లేటు, ఇతర వెండి వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. అలాగే మరో ఐదిళ్లలో కూడా చోరీ చేశారు. అయితే అక్కడ విలువైన వస్తువులు ఏవీ దొంగలకు దొరకలేదు. ఒక ఇంట్లో బంగారు, డబ్బు వున్నప్పటికి దొంగల కంట పడలేదు. మరో ఇంట్లో రూ.15వేల వరకు నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ చోరీల విషయం తెలుసుకున్న జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వర్లు సీఐ రఫీతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. చోరీ జరిగిన క్వార్టర్స్ లోకి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కాగా, ఆర్టీపీపీలో జరిగిన చోరీపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా చేసి వుంటుందన్న అను మానం వ్యక్తం చేశారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీంఎం ఏర్పాటు చేశామని వివరించారు.

భూ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల వెల్లువ


సబ్‌కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):భూ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు రైతులు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రైతుల నుంచి భూ సమస్యలు పరిష్కరించాలంటూ అధికంగా ఫిర్యాదులు అందాయి. ఇందులో బి.కొత్తకోటకు చెందిన దేరంగుల పెద్దఓబులేసు తన పిత్రా ర్జితంగా సంక్రమించిన గ్రామ సర్వేనెంబరు245లో 13 ఎకరా లు, 243 సర్వేనెంబర్‌లో 8.5 ఎకరాల భూమిని 300మందికి పేదలకు ఇవ్వడానికి సిద్ధం చేశామని ప్రస్తుతం మాజీ ఎంపీపీ ఖలీల్, చంద్రశేఖర్, గార్ల నాగరాజులు సర్వేనెంబరు 243లో తప్పుడు పత్రాలను 9ఎకరాల 27 సెంట్లకు సృష్టించుకుని మాపై దౌర్జన్యం చేస్తున్నారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బి. కొత్తకోట మండలం, కోటావూరు గ్రామంకు చెందిన బి. లక్ష్మీదేవమ్మ తన భర్త రామచంద్రారెడ్డి మృతి చెందాడని, ఉన్న భూమిని పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు తిప్పుతున్నారని ఫిర్యాదు చేశారు. బీకేపల్లె లక్ష్మీనగర్‌కు చెందిన గంగులప్ప కుమారుడు స్వామివేలుకు దివ్యాం గుల పెన్షన్ రావడంలేదని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు.

పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేయండి

● మంత్రి టీజీ భరత్‌కు టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వినతి


మంత్రి భరత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో పారి శ్రామిక కారిడర్లను ఏర్పాటు చేసి నిరు ద్యోగ సమస్యను తీర్చాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మంత్రి టీజీ భరత్‌ను కోరారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో పర్యటించిన పరిశ్రమల, వాణిజ్య, ఆహార శుద్ధిశాఖా మంత్రి టీజీ భరత్‌ను సోమ వారం మరో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం మండలంలో సోలార్ సిటీ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూములు ఉన్నాయని,వివరించారు. ఆసియాలోనే ములకలచెరువు టమోటా మార్కెట్ క్రయ, విక్రయాల్లో మొదటి స్థానంలో ఉందని ఇక్కడ టమోటా, ఫుట్ ప్రాసెసింగ్, వ్యవ సాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అనంతరం మం త్రితో తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలపై చర్చించి వినతి పత్రాలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మదనపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని హోప్ హైస్కూల్‌లో 2001-02 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ వీరంతా బడి ప్రాంగణంలో అడుగుపెడుతూనే హోదాలను మరచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగ, క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చదివిన తరగతి గదులు, ఆటలాడిన పాఠశాల పరిసరాలు కలియ తిరుగుతూ ఆనాడు చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ పరవశించిపోయారు. ఉపాధ్యాయులు, తోటి మిత్రులతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులను పొందారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీతకుమారి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సుగుణమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గజ వాహనంపై దేవదేవుడి అభయం


గజ వాహనంపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణుడు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడో రోజైన సోమవారం శ్రీవారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారిని రథం పై కొలువు దీర్చి రథోత్సవం వేడుకగా నిర్వహించారు. మాడ వీధు ల్లో ఊరేగుతున్న శ్రీవారిని దర్శించుకున్న భక్తులు గోవిందనామం స్మరిస్తూ స్వామి వారికి కర్పూర హారతులిచ్చి నైవేదాద్యాలు సమర్పించారు. భజన బృందాల కోలాటలు, చెక్కభజనలు, అన్నమ య్య సంకీర్తనలు, గోవిందనామస్మరణల నడుమ వాహన సేవ నయనమనోహరంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిబాల కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, రమేష్ స్వామి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైద్యాధికారులు సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పంపిణీ చేసినట్లు పెద్దతిప్పసముద్రం ప్రభుత్వాసుపత్రి డాక్టర్ పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నులిపురుగుల బారిన పడి రక్తహీనతకు గురై అనారోగ్యాన్ని కొని తెచ్చుకునే పిల్లల కోసం ప్రభుత్వం ఈమాత్రలను ఉచితంగా అందిస్తోందన్నారు. పాఠశాలలకు రాని పిల్లలకు వైద్య సిబ్బందిచే ఇళ్ల వద్దకు వెళ్లి వేస్తామని వారు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

బి.కొత్తకోట ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బి.కొత్తకోట రంగసముద్రం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులో నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. సదరు కంపెనీకి చెందిన ఆడిటర్లు మూడురోజులుగా బ్రాంచీలో రికార్డులను పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు. అంతర్గత విచారణ జరుగుతోందని ఖాతాదారులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

తాండా అభివృద్ధికి సహకరించండి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో నూతనంగా ఏర్పడిన అవికేనాయక్ తాండా అభివృద్ధికి ప్రభుత్వ సహాయ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కు రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు, అవికేనాయక్ తాండ గ్రామ సర్పంచ్ నటరాజ్‌నాయ క్ కోరారు. సోమవారం వారు ఆమేరకు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యాల యం, అంగన్‌వాడీ భవనం, ఆర్‌వో వాటర్ ప్లాంట్, ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలను ఇవ్వాలని సీపీఐ నాయకులు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, మురళిలు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందచేశారు. పేదలకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు అంజనప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను త్వరతగతిన పూర్తి చేయాలి

నిమ్మనపల్లి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవేటివారిపల్లి గ్రామ పంచా యతిలో జరగుతున్న భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ భూముల రీసర్వేను పరిశీలించి మాట్లాడుతూ భూముల రీసర్వే ఆయా రైతుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. అలాగే సర్వే పూర్తి అయిన తరువాత రైతుల వద్ద నుంచి అంగీకారపత్రం తీసుకోవాలన్నారు. అనంతరం రీసర్వే ఎంతవరకు వచ్చిందని వీఆర్వోను అడుగగా ఇప్పటి వరకు ప్రభుత్వ భూములు సర్వే పూర్తి అయ్యిందని పట్టా భూములలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగాపల్లి సమీపంలో వున్న 2ఎకరాలలో భూమిని పరిశీలించి ల్యాండ్ కన్వర్షన్‌కు అనుమతులు ఇచ్చారు. డీటీ బాబ్జి, వీఆర్వోలు శాంతకుమార్‌రెడ్డి, హేమాంబర్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్వేయర్ సిరాజ్, బాలకృష్ణ, మునిరత్నం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


మీనాక్షి హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ సమీపంలో ఎంఎంఆర్ టవర్స్‌లో మీనాక్షి ఎమర్జెన్సీ, జనరల్ ఆస్పత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా మదనపల్లెలో వైద్యసేవలందిస్తున్న మీనాక్షి హాస్పిటల్ నేడు నూతన భవనాల్లోకి మార్చడంతో పాటు ఆధునిక వైద్యసేవలకు సిద్ధం చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను మీనాక్షి హాస్పిటల్ యజమానులు డాక్టర్ బి.మల్లికార్జున, డాక్టర్ ఎం.వి.సాయి నిహారిక, భవన యజమాని కువైట్ మాధవరెడ్డి, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు, జనసేన నేత శ్రీరామరామాంజనేయులు, బలిజ సంఘం నాయకులు బీపీఎల్ విజయ్‌కుమార్, రాజ్‌భవన్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు బోటింగ్ క్లబ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ, మండల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు స్వామిచెరువుపై బోటింగ్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్వామిచెరువును అధికారులతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీకేఎం ఉడా నిధులతో మూడు బోట్లు తెప్పించి ప్రజలకు బోటింగ్ క్లబ్ అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే 40 ఎకరాల చెరువు చుట్టూ అక్కడక్కడ ఆక్రమణలు జరిగాయని వాటిని తొలగించి, సుందరీకరణ చేస్తామన్నారు. కాగా వ రెడ్డివారిపల్లెలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. గత ఆరు నెలలుగా గ్రామంలో తాగునీటి సమస్య ఉండటంతో ఎమ్మెల్యే ప్రభుత్వ నిధులు రూ.4లక్షలతో వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మదనపల్లె పట్టణంలో నలుగురుకి రూ.2లక్షల దాకా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

'తెలుగు యువత అధ్యక్షుడిపై చర్యలు తీసుకోండి'

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాం చినబాబుపై చర్యలు తీసుకోవాలని కులసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వేర్వేరుగా ఆందోళన చేపట్టిన ఆయా సంఘాల నేతలు ఈ మేరకు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాప క అధ్యక్షుడు కోనేటి దివాకర్, బీకేఎంయూ నాయకుడు టి.కృష్ణప్పలు మాట్లాడుతూ మదనపల్లె మండలం సీటీఎం గ్రామంలో మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవడంతో కోపోద్రికుడైన శ్రీరాం చినబాబు..వీఆర్వో పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ టిప్పర్ తాళాలు తీసుకుని వెళ్లిపోయారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు గుండా మనోహర్, మల్లెల మోహన్, తోపు కృష్ణప్ప పాల్గొన్నారు.

కార్మికుల కోసమే ఈ-శ్రామ్ కార్డులు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అసంఘటిత కార్మికుల కోసమే ఈ-శ్రామ్ కార్డులను ప్రవేశపెట్టారని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ-శ్రామ్ కార్డు పొందాలంటే నిర్ధేశిత వయస్సు 18నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలన్నారు. రోజువారి కూలీలతో పాటు చిన్న పరిశ్రమలలో పని చేసేవారు, డ్రైవర్లు, కండక్టర్లు, అంగన్‌వాడీలు తదితరులు ఈ కార్డులను పొంవచ్చన్నారు. ఈ కార్డు పొందిన వారికి ప్రమాద బీమా రూ. 2లక్షలు. ప్రమాదంలో గాయపడి వికలాంగులు అయితే వారు రూ. లక్ష రూపాయలు పొందవచ్చన్నారు. ఇవే కాకుండా ఈ-శ్రామ్ కార్డు వలన అనేక ప్రయోజనాలు పొందచ్చన్నారు. ఈ కార్డు పొందేందుకు సమీప మీ-సేవ కేంద్రాలలో, సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో తెలిపారు.